## ఈ జిల్లాలకు వర్ష సూచన..

హైదరాబాద్, రాష్ట్రంలో రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని పేర్కొంది. బుధవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపింది. మరో వైపు రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. చాలా జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. హైదరాబాద్‌లోనూ ఎండ పెరిగింది. దాంతో జనం తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బందిపడుతున్నారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :58 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 30-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## జాతి వ్యతిరేక శక్తులపై 'స్పైవేర్' తప్పు కాదు.. పెగాసస్‌పై సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ,నాలుగేళ్ల క్రితం దేశ రాజకీయాలను కుదిపేసిన పెగాసస్ వ్యవహారం ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం ఓ దేశం స్పైవేర్‌ను కలిగిఉండటం తప్పులేదని ఈ సందర్భంగా కోర్టు స్పష్టంచేసిం ది. అయితే ఆ స్పైవేర్‌ను ఎలా, ఎవరిపై వినియోగించారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. పెగాసస్ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈసందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. పెగాసస్ స్పైవేర్‌ను తను ఉపయోగిస్తోందా.. లేదా..? అనే విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై సాంకేతిక నిపుణుల బృందం దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఆదేశించిం దని, ఇప్పటివరకు ఆ నివేదిక ఊసే లేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఆ నివే దికను వెంటనే బయటపెట్టాలని కోరారు.దాంతో ధర్మాసనం స్పందిస్తూ.. 'దేశం స్పైవేర్‌ను వినియోగిస్తే తప్పేముంది. అయితే దాన్ని ఎవరిపైన వినియోగిస్తున్నా రన్నదే ఇక్కడ ప్రశ్న. పౌర సమాజంపై కాకుండా దేశ వ్యతిరేక శక్తులపై దాన్ని వినియోగిస్తే గనుక అందులో ఏ తప్పు లేదు. దేశ భద్రత విషయంలో రాజీపడ కూడదు. ఒకవేళ సామాన్య పౌరులపై స్పైవేర్‌ను వినియోగిస్తే గనుక దాని గురించి మేం దర్యాప్తు జరిపిస్తాం. కానీ జాతి వ్యతిరేక శక్తులకు, ఉగ్రవాదులకు గోప్యత హక్కు ఉండదు. సామాన్య పౌరుల గోప్యతకు మాత్రం మేం తప్పకుండా రక్షణ కల్పిస్తాం' అని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావించింది. ప్రస్తుతం దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో అందరికీ తెలుసని, మనం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇక సాంకేతిక బృందం నివేదిక గురించి మాట్లాడుతూ.. 'దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదు. ఒకవేళ ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు దాని గురించి తెలుసుకోవాలనుకుంటే వారికి సమాచారం అందిస్తాం. అంతేతప్ప వీధుల్లో చర్చించుకునే ఓ డాక్యుమెంట్‌గా ఈ నివేదిక మారకూడదు' అని ధర్మాసనం పేర్కొంది.

ఏమిటీ పెగాసస్ వ్యవహారం..?

ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్ఎస్‌వో గ్రూప్ 'పెగాసస్' స్పైవేర్‌ని అభివృద్ధి చేసింది. నిఘా కార్యకలాపాల కోసం ఈ స్పైవేర్‌ను పలు ప్రభుత్వాలు, ప్రభుత్వ అధీనంలో పనిచేసే సంస్థలకు ఎన్ఎస్‌వో విక్రయిస్తుంటుంది. అయితే ఈ పెగాసస్‌ను ఉపయోగించి పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖుల ఫోన్లను హ్యాక్ చేశారంటూ 2021లో ఓ అంతర్జాతీయ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. భారత్ నుంచి 300 మంది ఫోన్‌లు హ్యాక్ అయినట్లు పేర్కొంది. వారిలో రాజకీయ ప్రముఖులు ఉన్నట్లు తెలిపింది. ఈ వివాదం దేశ రాజకీయాలను కుదిపేసింది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే పెగాసస్‌పై విచారణకు ఆదేశించిన సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో స్వతంత్ర నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదికను రూపొందించింది.

## మిస్ వరల్డ్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష.

హైదరాబాద్,తెలంగాణలో మిస్ వరల్డ్ 2025 పోటీలు అట్టహాసంగా జరిపేందుకు సీఎం రేవంత్ సర్కార్ రెడీ అవుతోంది. మరికొన్ని రోజుల్లో ప్రారంభం కాబోతున్న ఈ పోటీలకు ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో మిస్ వరల్డ్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. MISS WORLD-2025 కి సంబంధించి ఏర్పాట్ల వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మే 10న మిస్ వరల్డ్-2025 పోటీలు ప్రారంభం కానున్నాయి. మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొనేందుకు వస్తున్న పార్టిసిపెంట్స్ కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్టు, అతిథులు బస చేసే హోటల్, కార్యక్రమాలు జరిగే చోట కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. తెలంగాణలో చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ తెలిపారు. విభాగాలవారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సీఎం సూచించారు. నగరంలో పెండింగ్ లో



ఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిస్ వరల్డ్-2025 ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు.

## మంచితనం ఎక్కువైపోయింది.. వాళ్లను పాకిస్తాన్ పంపేద్దాం..




హైదరాబాద్,యుద్ధం పరిస్థితులు వచ్చినా సిద్ధంగా ఉండాలంటూ జనసేనాని పిలుపు ఇచ్చారు. మత కలహాలు సృష్టించే వారిపై అప్రమత్తంగా ఉండాలని.. వారిని కలిసికట్టుగా ఎదుర్కోవాలని అన్నారు. పాకిస్తాన్‌కు సపోర్ట్‌గా మాట్లాడటం సరికాదని.. అలాంటి వాళ్లు ఆ దేశానికే వెళ్లిపోవాలని తేల్చి చెప్పారు పవన్ కల్యాణ్. పహల్గాం టెర్రర్ అటాక్‌లో చనిపోయిన వారికి జనసేన తరఫున నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రదాడిలో దుర్మరణం పాలైన మధుసూదన్‌రావు కుటుంబానికి పార్టీ తరఫున రూ. 50 లక్షలు సాయం అందించారు. జనసేన తరఫున ఆ కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు.

అతి మంచి.. అతి సహనం..

కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేశారు పవన్ కల్యాణ్. కొంతమంది ఇండియాలో ఉండి పాకిస్తాన్‌కు మద్దతుగా మాట్లాడటంపై మండిపడ్డారు. అతి మంచితనం మంచిది కాదని.. అతి సహనం కూడా ప్రమాదకరమని అన్నారు. పాకిస్తాన్‌ను మూడుసార్లు ఓడించామనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. హిందువులకు ఉన్నది ఒక్కటే దేశమని.. ఇక్కడ కూడా టార్గెట్ చేస్తే ఇంకెక్కడికి పోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రపతి పాలనలో..

ఐడీ కార్డులు అడిగి.. హిందువా? ముస్లింవా? అని తెలుసుకుని మరీ దారుణంగా చంపేశారని.. అమాయకులైన నిరాయుధుల ప్రాణాలు తీశారని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఉన్నంత వరకు ప్రశాంతంగా ఉందని.. అధికారం రాష్ట్రం చేతిలోకి వెళ్లగానే ఇలా ఉగ్రవాదులు రెచ్చిపోయారని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశమంతా ఏకమవ్వాల్సిన సమయం వచ్చిందన్నారు జనసేనాని. ఉగ్రవారం, హింసపై ప్రజలంతా ఒకేలా స్పందించాలని.. సత్యం మాట్లాడాలంటే చాలా ధైర్యం కావాలన్నారు పవన్ కల్యాణ్.

## తెలంగాణకు ఎప్పటికి కాంగ్రెస్ పార్టీనే విలన్

సూర్యాపేట,ఏప్రిల్29: తెలంగాణకు ఎప్పటికి కాంగ్రెస్ పార్టీనే విలన్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేరు విలన్ గానే తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది.. 16 నెలల్లో సమైక్య రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు వచ్చాయని ఆరోపించారు. ఒక్క ఏడాదిలోనే గురుకుల పాఠశాలల్లో 90 మంది విద్యార్థులు చనిపోయారు అని చెప్పుకొచ్చారు. ఇక, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తర కుమార ప్రగల్భాలు ఆపాలని సూచించారు. ఈ రోజు వరకు ఎంత ధాన్యం కొన్నారో ఉత్తమ్ కుమార్ లెక్క చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఎన్ని వడ్లు కొన్నారు?.. ఎంత బోనస్ ఇచ్చారో చెప్పాలన్నారు. చెప్పకపోతే మీరు రండలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మీద ఎందుకు ఏడుస్తున్నారు.. కేసీఆర్ మీకు సంవత్సరం పైనే సమయం ఇచ్చారని జగదీష్ రెడ్డి తెలిపారు. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభపై ప్రజల్లో చర్చ జరుగుతోంది అని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. ఇక, సభకు వచ్చిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు.. బహిరంగ సభలో రేవంత్ రెడ్డి పేరు కేసీఆర్ చెప్పలేదని సీఎం బాధపడుతున్నారనిఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ ని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు గుర్తు పెట్టుకోవడం లేదని సెటైర్లు.. ఇక, తెలంగాణను ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ పేరు ఎత్తితే వాళ్ళను నక్సలైట్ల పేరుతో కాంగ్రెస్ కాల్చి చంపింది అని గుర్తు చేశారు. చంద్రబాబు చేతిలో నడ్డి విరిగిన కాంగ్రెస్ 2004లో టీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుంది.. యూపీఏ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును టీఆర్ఎస్ పెట్టించింది.. కేసీఆర్ తిడుతున్న వాళ్ళు నాడు సమైక్యాంధ్ర తొత్తుల కింద ఉన్నారు అని



జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన రిపోర్ట్ నిజమని నిరూపించు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాజీమంత్రి జగదీష్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తే ఎవరూ పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని మీరు, ప్రజలు ఎదురు చూశారు.. అసెంబ్లీలో పిల్లల్ని ఏం పీకలేకపోతున్నారు.. అవతలి టీమ్ బలహీనంగా ఉందని పిల్లల్ని అసెంబ్లీకి పంపుతున్నారు.. కేసీఆర్ ఏ టైంకి, ఎట్లా రావాలో అసెంబ్లీకి వస్తారు.. ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని జీవో ఇచ్చారు.. 41 వేల కోట్లు రుణమాఫీ అని చెప్పి 21 వేల కోట్లు చేశామని చెప్పారు.. ఇప్పుడు రైతు రుణమాఫీ పూర్తి అయిందని అంటున్నారు.. బీఆర్ఎస్ సభను చూసి లాగులు తడుపుకుంటున్నారని సెటైర్లు వేశారు.

## సరిహద్దు ఉద్రిక్తలపై కేంద్రం సమీక్ష...

న్యూఢిల్లీ,పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత కేంద్రం వరుస సమీక్షలు నిర్వహిస్తోంది. ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇక ఉగ్ర దాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి (ఎల్ఓసీ) పాకిస్థాన్ వరుస కాల్పులకు తెగబడుతోంది. భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతోంది. తాజా పరిణామాలపై బుధవారం మరోసారి భద్రతా వ్యవహారాల కేంద్ర కేబినెట్ కమిటీ భేటీకానుంది. ఈ సమావేశంలో ప్రస్తుత పరిణామాలపై సమీక్షించి.. మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకా శం ఉంది. ఇప్పటికే పాకిస్థానీయుల వీసాలను కేంద్రం రద్దు చేసింది. ఇక మెడికల్ వీసాలు మంగళవారంతో ముగుస్తున్నాయి. ఇప్పటికే పాకిస్థానీయులను పంపించేశారు. అయితే కొందరు మెడికల్ ఎమర్జెన్సీ రిక్వెస్ట్ అడుగుతున్నారు. దీనిపై కేంద్రం ఏ నిర్ణయం తీసుకుంటుందన్న ఆసక్తి నెలకొంది. బుధవారం నుంచి అటారీ సరిహద్దు దగ్గర రాకపోకలు బంద్ కానున్నాయి. తదుపరి పరిణామాలపై కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. పహల్గామ్ ఉగ్ర దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. అనంతరం కేంద్రం కఠిన నిర్ణయాలు తీసుకుంది. సింధు జలాలు నిలిపివేసింది. అలాగే వీసాలు రద్దు చేసింది. అంతేకాకుండా అటారీ సరిహద్దు మూసివేసింది.



అనంతరం పాకిస్థాన్ యూట్యూబ్ ఛానళ్లు నిలిపివేసింది. ఇలా ఒక్కొక్కటిగా కేంద్రం కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది.

## కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు...



హైదరాబాద్,మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యే పూర్తి అర్హతలు ఉన్నాయని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీతో పాటు, రాష్ట్ర రాజకీయ వర్గాల్లోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. రాజగోపాల్ రెడ్డి తన వ్యాఖ్యలలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇద్దరూ అత్యంత సీనియర్ నాయకులని, తెలంగాణ రాజకీయాల్లో వారికి దశాబ్దాల అనుభవం ఉందని పేర్కొన్నారు. సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలు కలిగిన వీరిద్దరూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయగలరని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో వీరిద్దరూ బలమైన శక్తిగా ఎదిగారని కూడా ఆయన అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు వీరి నాయకత్వంలోనే పూర్తవుతున్నాయని కూడా ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. అయితే, రాజగోపాల్ రెడ్డి గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేసి ఉండటం గమనార్హం. తాజాగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న ఇతర కాంగ్రెస్ నాయకులు ఈ వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ, పదవుల కేటాయింపుపై అంతర్గత మంతనాలు, అసంతృప్తులు ఉన్నాయనే వార్తలు వస్తున్న నేపథ్యంలో, రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు పార్టీలో మరింత అలజడికి కారణమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉన్నారు. ఆయన నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో, సీనియర్ నాయకుల సీఎం ఆకాంక్షలను వ్యక్తం చేస్తూ రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ క్రమశిక్షణకు లోబడి ఉన్నాయా లేదా అనే దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రాజకీయ విశ్లేషకులు ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీలోని పాత, కొత్త నాయకత్వం మధ్య ఉన్న అంతర్గత పోరుకు సంకేతంగా చూస్తున్నారు. మరికొందరు మాత్రం ఇవి కేవలం వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే కావొచ్చని అంటున్నారు. మొత్తానికి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఈ విషయంపై ఎలా స్పందిస్తుంది. పార్టీలోని ఇతర నాయకుల నుండి ఎలాంటి ప్రతిస్పందన వస్తుంది, ఈ వ్యాఖ్యలు భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయి అనేది వేచి చూడాలి. రానున్న రోజుల్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరిన్ని ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో వంద శాతం చిన్నారులు హాజరయ్యేలా చూడాలి

నల్లబెల్లి, ఏప్రిల్ 29 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు వంద శాతం హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సీడీపీఓ మధురిమ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రైతు వేదికలో అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లకు నెలవారి సమావేశం నిర్వహించారు.

## ఏక్ నాథ్ షిండే సంచలన కామెంట్స్



ముంబై:ఉగ్ర దాడిపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కీలక ప్రకటన చేశారు. ఈ దాడి చాలా దురదృష్టకరమనిబీ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పొరుగు దేశం పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రక్తానికి రక్తంతో ప్రతీకారం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత ఇరు దేశాల మధ్య పరిస్థితులు దారుణంగా మారిపోయాయి. భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉంది. ఉగ్రదాడికి ధీటుగా భారత్ ఎప్పుడైనా దాడి చేయగలదని పాకిస్తాన్ భయపడుతోంది. ఇదిలా ఉండగా ఉగ్ర దాడిపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కీలక ప్రకటన చేశారు. ఈ దాడి చాలా దురదృష్టకరమని ఆయన అన్నారు. దీనితో పాటు, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పొరుగు దేశం పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమాయక టూరిస్టులను చంపిన ఉగ్రవవాదులను ఏ ఒక్కర్ని కూడా వదలకూడదని.. రక్తానికి రక్తంతో ప్రతీకారం తీర్చుకోవాలని షిండే పిలుపునిచ్చారు.

దేశంపై జరిగిన దాడి

ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మాట్లాడుతూ, "పహల్గామ్ దాడి చాలా విచారకరం, దురదృష్టకరం. ఇది ఒక వ్యక్తిపై కాదు, దేశంపై జరిగిన దాడి. దేశస్థులందరూ దీనిని తీవ్రంగా పరిగణించారు. దీనిపై రాజకీయాలు చేయడం పనికిరానిది. ఇది రాజకీయాలకు సమయం కాదు" అని అన్నారు. "మన సైనిక సిబ్బంది దేశ సరిహద్దుల్లో ఉన్నారు. వారికి మద్దతుగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మద్దతుగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది. ఇలాంటి సమయంలో రాజకీయాలు చేయడం తప్పు," అని అన్నారు. మన ప్రజలపై దాడి చేసిన ఉగ్రవాదుల ఇళ్లను బాంబులతో పేల్చివేశారు. రక్తానికి రక్తంతోనే ప్రతీకారం తీర్చుకోవాలి. పాకిస్తాన్‌ను విడిచిపెట్టవద్దు. దేశంలోని ప్రతి పౌరుడు పాకిస్తాన్‌ను తుడిచిపెట్టాలని కోరుకుంటాడు, ప్రధాని మోడీ ఈ కోరికను నెరవేరుస్తారని తాను ఆశిస్తున్నానని షిండే చెప్పుకొచ్చారు.


## సంపాదకీయం

బుధవారం 30-04-2025

# పన్నుల విధానంతో ధరల స్వారీ !

దేశంలో ఆహార ధరల పెరుగుదల అంతకంతకూ ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల వంటనూనెల ధరలు మరింత ప్రియంగా మారాయి. ఆహారధాన్యాలు ఇబ్బడిముబ్బడిగా పండుతున్నా ప్రజలకు మాత్రం చౌకగా దక్కడం లేదు. పేదవారి పట్ల పార్టీలు వేరైనా పాలకులంతా మొసలి కన్నీరు కారుస్తోంది. కాకమ్మ కబుర్లు చెప్పి కాలం వెళ్లదీస్తున్నాయి. అధికారం కోసం నానాగా గడ్డీ కరుస్తున్నాయి. దేశంలో అన్ని వస్తువుల,సేవల ధరలూ పెరిగిపోతూ వుంటే, దాని ప్రభావాన్ని తట్టుకుని భరించే స్థితిలో సామాన్య ప్రజలు లేరు. ప్రభుత్వాలు తాము పెంచుతున్న ధరలు కావచ్చు..జిఎస్టీ కావచ్చు..గ్యాస్ కావచ్చు సామాన్యులకు భారం పడదన్న ధోరణిలో ఉన్నారు. నిజానికి ఏ వస్తువు అయినా ధరలు వెచ్చించి సామా న్యులు కొనాల్సిందే. ఏకీకృత పన్ను విధానం పేరుతో తీసుకుని వచ్చిన జిఎస్టీ ఇప్పుడు సామాన్యులకు గుదిబండగా మారింది. పాన్, ఆధార్ లింక్ కూడా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారనుంది. దీనికితోడు కనీసం వేయి రూపాయల ఛార్జీ వడ్డిస్తున్నారు. దీనికితోడు తాజాగా యూపిఎ చెల్లింపులపై ట్యాక్స్ విధించే ఆలోచన దుర్మార్గం కాక మరోటి కాదు. అప్పుడెప్పుడో జుట్టు పన్ను కూడా విధించారు. ఇప్పునుడు అదే తరహాలో పన్నులేని పని, వస్తువు, సేవలు లేకుండా పోయాయి. పన్నుల రూపంల ప్రజలు ఇల్లు గుల్ల చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఇప్పుడు ధరలు సవారీ చేస్తున్నాయి. బంగారం, వెండి ధరలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నాయి. ఇవి ప్రభుత్వ అజమాయిషీ లేని జాబితాలో చేరాయి. వారి ఆదాయాలు పెరగకుండా ధరల పెరుగుదల ను భరించే స్థితిలో ప్రజలు ఉన్నారా లేరా..అన్నది కూడా పాలకులు ఆలోచన చేయడం లేదు. శ్రామిక వర్గ ఆదాయాలు పెరిగే ధరలకు అనుగుణంగా పెరగగకుంటే ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం ప్రభుత్వానికి సాధ్యం కాదు. శ్రామిక ప్రజల ఆదాయాలు పెరగవని తెలుసు. పెరగడం లేదని కూడా తెలుసు. భారమంతా శ్రామిక వర్గమే అంతిమంగా భరించాల్సి వస్తుందని కూడా పాలకులు తెలుసు. తెలిసి కూడా పెట్రో,గ్యాస్, జిఎస్టీ ధరల పెరుగుదలకు అడ్డూఅదుపు లేకుండా చేస్తున్నారు. ఇక సామాన్యుల ఇంటికలను ఛిద్రం చేసేసారు. సామాన్యులు సొంతంగా ఇల్లు కల్లుకునే పరిస్థితి లేదు. మరోపక్క అంతర్జాతీయ చమురు ధరలు పెరిగిన ప్రతిసారీ, దేశీయంగా పెట్రో ధరలను పెంచి తీరాలన్న సూత్రం ఏదీ లేదు. కానీ అలా పెంచడం వల్ల ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. పెట్రోల్ అన్నది ఇప్పుడు కేంద్రానికి ఆదాయవనరుగా మారింది. పెట్రో ధరల పెంపు అనేది ప్రభుత్వం అనుసరించే ద్రవ్య వ్యూహం బట్టి ఉంటుంది. ఈ ద్రవ్య వ్యూహాన్ని ప్రభుత్వం ఎప్పటి కప్పుడు మార్చుకునే వీలున్నా అందుకు కేంద్రం సిద్దంగా లేదు. పెట్రో ధరలను తమకు ఇష్టం లేకున్నా పెంచవలసి వస్తోందని వాపోవడం దొంగనాటకం కాక మరోటికాదు. పెట్రో ఉత్పత్తుల ధరలో దాదాపు సగం భాగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులకే పోతుంది. ఈ పన్నులకి, అంతర్జాతీయ చమురు ధరలకి సంబంధం లేదు. అయినా ఆ పన్నులను పెంచుకుంటూ దోచుకుంటున్నారు. రాజకీయ నాయకుల జీతభత్యాలపై మాట్లాడడం లేదు. అనవసర ఖర్చులపై మాట్లాడడం లేదు. తన వంతు అదనంగా ప్రజల మీద కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భారాన్ని మోపుతూనే పోతోంది. రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని కొంత వరకూ అర్ధం చేసుకోవచ్చు. వాటి పరిధిలో పరిమితమైన ఆదాయ వనరులే ఉన్నాయి. ముఖ్యంగా జి.ఎస్.టి విధానం వచ్చాక రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలు బాగా తగ్గిపోయాయి. పెట్రో ఉత్పత్తులు జిఎస్టి పరిధి లోకి రావు. అందుకే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు పెట్రో ఉత్పత్తుల మీద పన్నులు వసూలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యక్ష పన్నులు విధించే అధికారం లేనందువలన వాటికి వేరే దారి లేదు. కాని కేంద్ర ప్రభుత్వం వేరు. వేర్వేరు మార్గాల్లో అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కాని కావాలనే అది ఆ మార్గాలను ఉపయోగించడంలేదు. సంపన్నులమీద ప్రత్యక్ష పన్నులు విధించవచ్చు. ఆ సంపన్నుల పట్ల పక్షపాత వైఖరితో ప్రభుత్వం ఉంది కాబట్టి ఆ ప్రత్యామ్నాయాన్ని అది ఆలోచించడం లేదు. సంపన్న వర్గాలే పెట్రో ఉత్పత్తులను ఎక్కువగా ఉపయోగిస్తాయి గనుక పెట్రో ఉత్పత్తుల మీద ధరలు పెరిగితే వారిమీదే భారం ఎక్కువగా పడుతుందని ఎవరైనా భావిస్తే అది చాలా పొరపాటు. పెట్రో ఉత్పత్తులలో సామాన్య ప్రజలు నేరుగానే వినియోగిస్తారు. ఇందుకు ఉదాహరణ వంట గ్యాస్. ఇక పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగితే రవాణా చార్జీలు అనివార్యంగా పెరుగుతుంటాయి. దానితోబాటు వినిమయ వస్తువుల ధరలన్నీ పెరుగు తాయి. వాటిలో ఆహార ధాన్యాలతో సహా చాలా వస్తువులను ప్రజలే ఎక్కువగా వినియోగిస్తారు. ఇక సంపన్నులు పెట్రో ఉత్పత్తులను వినియోగించి ఉత్పత్తి చేసే వివిధ రకాల సరుకుల రేట్లను పెంచి అమ్ముతారు. ఆ విధంగా కూడా అంతిమంగా వినియోగదారుల పైనే భారం అంతా పడుతుంది. పెట్రో ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని సామాన్య ప్రజలు మాత్రమే కోరుకుంటారు. ఎందుకంటే వారే నేరుగా బాధ్యలు కనుక. వినిమయం తగ్గితే మార్కెట్‌లో మాంద్యం మరింత పెరుగుతుంది. అది మరింత ఎక్కువ గా నిరుద్యోగానికి దారి తీస్తుంది. ఆ విధంగా ఒక వైపు ద్రవ్యోల్బణం, మరోవైపు మాంద్యం ఆర్థికంగా దెబ్బ తీస్తుంది. ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల పంపిణీని నియంత్రించి రేషనింగ్ విధానాన్ని అమలు చేయడం ద్వారా కొంత కంట్రోల్ చేయవచ్చు. నిజాయితీ ఉంటే ప్రత్యామ్నాయ ద్రవ్య విధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధపడాలి. అదికూడా ప్రజలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించాలి. అప్పుడే ప్రజలపై భారం పడదు. నిజానికి ప్రజల నుంచి డబ్బులు గుంజడమెలా అన్నది కేంద్రం చేస్తున్న ఆలోచన.. జిఎస్టీతో ప్రజలు అల్లాడుతున్నా..పన్నులు కట్టలేక చస్తున్నా..పెట్రోల్ ధరలతో దాడులు చేస్తున్నా.. పట్టించు కోని ప్రధాని మోడీ రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలని గతంలో చేసిన సూచనలు ప్రజలంతా గమనిస్తున్నారు. మోడీ వచ్చాక వివిధ రూపాల్లో జిఎస్టీ వసూళు లక్షల కోట్లలో పెంచుకుంటున్నారు. కానీ ప్రజలపై పడుతున్న భారాలపై మాట్లాడడం లేదు. నిజానికి మోడీ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఏ అంశం పైనా చర్చించడం లేదు. ప్రజలను విస్మరించి చేస్తున్న పాలన కారణంగా ప్రజలు నానా యాతన పడుతున్నారు. ప్రజలు ఈ అంశాలపై చర్చించాలి. పాలకుల నిజ స్వరూపాన్ని నిగ్గదీయాలి. అప్పుడే పాలకులు దారికొస్తారు.

# జనసేనకు సత్తా ఉన్నట్టా లేనట్టా ?



హైదరాబాద్,'ఇప్పుడే సొంతగా అధికారంలోకి వచ్చే సత్తా తన పార్టీకి లేదు' అని ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నాడు. ఆ వ్యాఖ్యల మీద అనేక విమర్శలు, విశ్లేషణలు వచ్చాయి. సత్తా లేనప్పుడు రాజకియాలెందుకనీ, పవన్ కళ్యాణ్ చేతులెత్తేశాడని వివిధ మీడియా వేదికల మీద చర్చలు జరిగాయి. కానీ లోతుగా పరిశీలిస్తే పవన్ కళ్యాణ్‌కి తన వ్యాఖ్యల మీద ఒక స్పష్టత, దృక్పథం ఉన్నట్టుగా కనిపిస్తుంది. రెండు బలమైన పార్టీలతో సతమతమౌతూ మూడో పార్టీకి ఏమాత్రం చోటు ఇవ్వని ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన గమనాన్ని పరిశీలిస్తే అది అర్ధం అవుతుంది. కుర్చీ వైపు చూడటమే మూడో పార్టీకి పెద్ద సాహసమైన రాష్ట్రంలో జీరో నుంచి పవర్ షేరింగ్ స్థాయికి ఎదిగిన జనసేనకి సత్తా లేదంటే ఎవరూ నమ్మరు. మరి ఆ వ్యాఖ్యలు ఎందుకు చేసినట్టు?పవన్ కళ్యాణ్ ఆ వ్యాఖ్యల్ని చేసింది చేతులెత్తేసి కాదు, తన చేతుల్ని బలోపేతం చేసుకోవటం కోసమేనని చెప్పాలి. తన పరిమితులని అధిగమించే పనిలో భాగమే ఆ వ్యాఖ్యల సారాంశంగా చూడాలి. తన భాగస్వామ్య పక్షాల్లోనూ, కేడర్‌లోనూ టెన్షన్స్‌ని తగ్గించి, కూటమి ప్రభుత్వానికి ఆటంకాలు తొలిగించే క్రమంలోనే పవన్ కళ్యాణ్ ఆ వ్యాఖ్యల్ని చేసినట్టు కనిపిస్తుంది. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య టెన్షన్లు ఏ స్థాయిలో ఉన్నాయన్నది వేరే చర్చ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో 2009- 2014 మధ్య కాలాన్ని అనిశ్చిత ఐదు సంవత్సరాలుగా పేర్కొనవచ్చు. ఈ ఐదు సంవత్సరాల్లోనే కాంగ్రెస్‌లో ప్రజారాజ్యం విలీనం, నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అకాల మరణం, వైసీపీ జననం, జనసేన ఆవిర్భావం, రాష్ట్ర విభజన, కొత్తగా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఏర్పాటు వంటి పలు సంచలనాత్మక పరిణామాలు జరిగాయి. వర్తమాన రాజకీయాల్లో ఒక రాష్ట్రంలో అంత తక్కువ కాలంలో అన్ని దీర్ఘ కాల ప్రభావం కలిగిన పరిణామాలు జరగటం ఓ చరిత్రే. 2014 ఎన్నికల నాటికి అనిశ్చితి కొంత తొలిగినా అప్పులు, అవమానాలు, అనుమానాలు, ఆందోళనలతోనే ఆంధ్రప్రదేశ్ కొత్త అడుగులు ప్రారంభించింది. ఈ క్లిష్ట సందర్భంలోనే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించటం, టిడిపి- బిజెపితో జతకట్టడం జరిగిపోయాయి. కానీ ఆ ఎన్నికల్లో జనసేన ఒక్క సీటుకు కూడా పోటీ చెయ్యలేదు. ఆ ఎన్నికల్లో పోటీ చెయ్యక పోవటం రాజకీయ అపరిపక్వత అని వ్యాఖ్యానాలు వచ్చాయి. నిజానికి ఇక్కడే పవన్ కళ్యాణ్ రాజకీయ చతురత కనిపిస్తుంది. ఆ ఎన్నికల్లో పోటీ చెయ్యకుండానే పోటీ చేసిన వారి కంటే పవన్ కళ్యాణ్ ఎక్కువ పేరు తెచ్చుకోవటం జరిగింది. ఆ ఎన్నికల్లో ఎన్డీఏ కేవలం 5 లక్షల ఓట్లతో బయట పడిన సంగతి గమనార్హం. పవన్ కళ్యాణ్‌తో పొత్తు లేకపోతె వైసిపి చేతిలో ఎన్డీఏ తీవ్రంగా ఓడిపోయి ఉండేదని మేధావులు ఆ ఎన్నికలని విశ్లేషించారు. తరువాత 2019 ఎన్నికల్లో జనసేన బియస్పీ, వామ పక్షాలతో కలిసి పోటీ చేసి ఒక సీటు గెలిచింది. వైసిపి 151 సీట్లోతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. టిడిపి 23 సీట్లకి పరిమితమైంది. పవన్ కళ్యాణ్ గత రెండు అనుభవాలతో 2024 ఎన్నికలకి వెళ్లినట్టు కనిపిస్తుంది. స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు అరెస్ట్ తో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న టిడిపికి ఆయన అండ ఆక్సిజన్‌లా పని చేసిందని అందరికి తెలిసిందే. అందుకే నలభై ఏళ్ల తెలుగు దేశాన్ని 2024 ఎన్నికల్లో జనసేన గెలిపించిందని పిఠాపురం సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు అతిశయోక్తిగా అనిపించదు. జైల్లో చంద్రబాబుని కలిసిన తరువాత పవన్ కళ్యాణ్ టిడిపితో పొత్తు ప్రకటించినప్పుడే కూటమి సక్సెస్ దాదాపు ఖరారు అన్న చర్చ పెద్ద ఎత్తున జరిగింది. ఆయా పార్టీల శ్రేణుల్లో ఆత్మ విశ్వాసం పెరిగిన సందర్భంగా కూడా దాన్ని పలువురు గుర్తించారు. బిజెపికి ఇష్టం లేకపోయినా పవన్ కళ్యాణ్ పట్టుపట్టి ఆ పార్టీని పొత్తుకి ఒప్పించటం కూటమికి ఎలక్షనీరింగ్‌లో తిరుగులేని ఆధిక్యతని తెచ్చిపెట్టిందనటంలో సందేహం లేదు. నిజానికి ఆ పొత్తే వైసిపికి శరాఘాతం అయ్యిందని గమనించాలి. ఈ విధంగా చూసినపుడు 2014లోనూ 2024లోనూ ఎన్డీఏకి పవన్ కళ్యాణ్ ఆక్సిజన్ గా పని చేశారన్న చర్చలో వాస్తవం లేకపోలేదు. చంద్రబాబు అరెస్టుతో నీరసపడి ఇతర పార్టీల వైపు చూస్తున్న కొందరు టిడిపి నాయకులు పవన్ కళ్యాణ్ ప్రకటనతో ఆ ప్రయత్నాలు విరమించు కోవటం విస్మరించలేని వాస్తవం. అప్పటి వరకు ప్రజాక్షేత్రంలో ఆధిక్యతని ప్రదర్శించిన వైసిపి దూకుడుకి ఈ పొత్తు బ్రేక్ వేసిందని చెప్పటం అతిశయోక్తి కాదు. 2024 ఎన్నికల్లో కూటమిలో పవన్ కళ్యాణ్ లేకపోతె జగన్‌కి నల్లేరు మీద నడక అయ్యుండేదని మేధావులు విశ్లేషించటం మరచి పోకూడదు. ఆ పరిస్థితిని తారుమారు చేసింది పవన్ కళ్యాణే అని నేషనల్ మీడియాలో కూడా అంచనా వేయటం గుర్తు తెచ్చుకోవాలి. అయితే, గత కొంత కాలంగా ఎన్డీఏ కూటమిలో టిడిపి, జనసేన కార్యకర్తలు ఎవరికి వారు తమ బలాబలాల్ని అతిగా ఊహించుకొంటూ ఘర్షణలకు దిగుతున్నారు. ఇవి చిలికి చిలికి గాలివానలా మారే ప్రమాదం లేక పోలేదు. గతంలో ఇలాంటి ఘర్షణలు పొత్తుల్ని పతనం చేసిన చరిత్ర తెలిసిందే. బీహార్ దీనికి పెద్ద ఉదాహరణగా నిలుస్తుంది. ఈ ప్రమాదాన్ని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పసిగట్టినట్టున్నారు. అందుకే ఎప్పటికప్పుడు తమతమ కార్యకర్తల్ని అదుపు చేసుకోవటానికి ఇద్దరూ ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తుంది. ముఖ్యంగా పవన్ కళ్యాన్ సొంతగా నిలబడే శక్తి సాధించే వరకు పొత్తు అవసరమని తనవారికి తెలియజెప్పాల్సి వుంటుంది. అందుకే ఎలాంటి పరిస్థితుల్లో గత పదిహేను సంవత్సరాలు తను జనసేనని నిలబెట్టుకున్నాడో, కూటమి కట్టి అధికారంలో భాగం పంచుకోవటానికి ఎంత కష్టపడ్డాడో పవన్ కళ్యాణ్ ఎప్పుడూ తన కార్యకర్తలకి గుర్తు చేస్తు ఉండవచ్చు. నేటి రాజకీయ పరిస్థితుల్లో ఏ పార్టీ మనుగడకైనా, విస్తరణకైనా అధికారంలో వుండటం ఎంత అవసరమో తెలిసిందే. అది జనసేనకు కూడా మినహాయింపు కాదు. ఊహల్లో తేలిపోతున్న తన కేడర్‌ని నియంత్రించి, అధికారాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని చెప్పటానికే పవన్ కళ్యాణ్ తన'సొంత సత్తా' గురించిన వ్యాఖ్యలు చేసినట్టు భావించాలి. సత్తా లేనప్పుడు రాజకియాలెందుకు అనే విమర్శ సహజమే. కానీ కొత్తగా రాజకీయాల్లో నిలదొక్కుకుంటున్న సామాజికవర్గాలకి, పార్టీలకి దీన్ని వర్తింప చేయకూడదు. ఇలాంటి కొత్త పార్టీలకి శక్తి అమాంతంగా ఒకేసారి రాదు. నెమ్మదిగా, క్రమక్రమం అవి శక్తిని పుంజుకుంటాయి. కొన్నిసార్లు దానికి కొన్ని దశాబ్దాలు కూడా పట్టవచ్చు. ఈ క్రమంలోనే పవన్ కళ్యాణ్ సొంతగా అధికారంలోకి రావటానికి సత్తా చాలక పోవచ్చు. కానీ కొందరిని ఓడించటానికి, కొందరితో గెలుపుని పంచుకోవటానికి సరిపోతుందని రాష్ట్రంలో ఇప్పటికే నిరూపితమైందని గుర్తించాలి. జనసేన సొంతగా నిలదొక్కుకునే వరకు ఈ పరిస్థితి కొనసాగ వచ్చు.పరిమితమైన శక్తితో అధికారంలోకి రావటానికి కావాల్సిన పొలిటికల్ క్రాఫ్ట్ మీద, వ్యూహాల మీద పవన్ కళ్యాణ్‌లో ఒక స్పష్టమైన అవగాహన కనిపిస్తుంది. సమకాలీన పరిస్థితుల్లో వేగంగా వ్యూహాలు మార్చు కోగలిగే పద్ధతి ఆయన రాజకీయాల్లో ప్రస్ఫుటంగా కనబడుతుంది. ఆ క్రమంలోనే 2014 ఎన్నికల్లో తాను పొత్తులో వుంటే గెలుస్తారని నిరూపణ చేసినట్టు గుర్తించాలి. 2019లో తను పొత్తులో లేకపోతె గెలవటం కష్టమని చూపించినట్టుగా భావించాలి. 2024 ఎన్నికల ద్వారా మూడో స్థానమే ఊహకందని అసెంబ్లీలో తన పార్టీని రెండో స్థానానికి చేర్చినట్టుగా అర్ధం చేసుకోవాలి. ఇదంతా యాదృచ్ఛికంగా జరిగినట్టు కనబడదు. ఇదంతా పవన్ కళ్యాణ్ ప్రణాళిక ప్రకారమే జరిగినట్టు భావించాల్సి వుంటుంది. ఇక్కడ మనం గుర్తించాల్సిన అంశం ఏమిటంటే పవన్ కళ్యాణ్ కు రాజ్యాధికారం పట్ల ఉన్న అవగాహన. పవన్ కళ్యాణ్ నిస్సందేహంగా నయా సబాల్ట్రాన్ తరగతుల ఆకాంక్షలకు ప్రతినిధి. సమాజంలో ఊర్ధ్వ చలనం లో ఉన్న అణగారిన తరగతులకు, వారి ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహిస్తూ వామపక్షాలు, బీఎస్పీ లతో పొత్తు పెట్టుకున్నారు. కానీ ఈ ప్రయోగం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు ఇవ్వదు అని అర్థం అయ్యాక 2024 ఎన్నికల నాటికి తన లక్ష్య సాధనకు అవసరం అయిన వ్యూహాలు ఎంచుకున్నారు. ఫలితం రాష్ట్రం లో ఎన్డీఏ కూటమి అధికారం. అందులో చంద్ర బాబు కూడా కాదనలేని స్తాయిలో జనసేన పలుకుబడి. ఈ వాస్తవాన్ని విస్మరించి ఏ విశ్లేషణ చేసినా అది సత్యదూరమే అవుతుంది. జనసేన ఎదుగుదల వల్ల నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీహార్ తరహా రాజకీయాలకి తెరలేచింది. సంకీర్ణ రాజకీయాలు మొదలైయ్యాయి. శాశ్వత ప్రయోజనాలే తప్ప- శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు కనబడని నేటి రాజకీయాల్లో పెద్ద పార్టీలకి రేపు ఎలా ఉంటుందో చెప్పలేం. కానీ, జనసేన లాంటి మధ్యస్థాయి పార్టీల పాత్ర మాత్రం అత్యంత కీలకంగా మారబోతుందని అనుభవాలు సూచిస్తున్నాయి. అలాంటి పార్టీ మద్దతు ఎవరికి వుంటే వారే అధికారంలోకి వచ్చిన ఉదాహరణలు ఉత్తరప్రదేశ్‌లో, బీహార్‌లో చూశాం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఆ దశకి చేరినట్టు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో రెండు పార్టీలు తప్ప ఇంకెవరికి చోటు లేదనే అభిప్రాయం క్రమంగా చెరిగిపోతు ంది. ఇప్పుడు జనసేన ఎటు మొగ్గితే అటే గెలుపు అనే పరిస్థితి కొంత కాలం ఉండేలా అనిపిస్తుంది. ఇదంతా విశ్లేషిస్తే పవన్ కళ్యాణ్ తనకి సత్తా లేదన్నది ప్రస్తుతం ఒంటరిగా ఎన్నికలకి వెళ్ళటం గురించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యటం గురించి మాత్రమె అని గుర్తించాలి. తన భవిష్యత్తు రాజకీయం గురించి కాదని అర్థం చేసుకోవాలి. నాయకుడు అతిగా అంచనా వేసుకోకుండా ఆత్మవిమర్శ చేసుకున్నప్పుడే వున్నది వున్నట్టు గ్రహించగలుగుతాడు. పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆ దిశలోనే విశ్లేషించుకుని అడుగులు వేస్తున్నట్టు అర్ధమవు తుంది. సంకీర్ణ రాజకీయాల్లో కొత్త ప్రయోగాలకు తెర తీస్తున్న పవన్ కళ్యాణ్ విభిన్న పరిస్థితుల్లో ఎలాంటి ఎత్తుగడలు వేస్తాడో ఊహించలేం. కానీ దీర్ఘ కాలం అధికారంలో భాగస్వామిగా వుండే విధంగానే అయన వ్యూహాలు ఉంటాయని మాత్రం నిర్ధారించుకోవచ్చు. రాష్ట్రంలో ఒక నిర్ణయాత్మక శక్తిగా మారిన పవన్ కళ్యాణ్ మద్దతు కోసం భవిష్యత్తులో టిడిపి, వైసిపి పోటీ పడినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదనే అంచనాలు నిజమైనా కావచ్చు. ఈ రెండు పార్టీలు ఒకరినొకరు నిలువరించుకునే క్రమంలో జనసేన కీలకం అయ్యే అవకాశాలు మెండుగా వున్నాయి.

# ఆ వంతెనలు త్వరలో అందుబాటులోకి..



హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిప్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పరిధిలో నిర్మించి రెండు వంతెనలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. కోట్లాది రూపాయలతో ఈ వంతెనలను నిర్మించారు. ప్రస్తుతం వాటి నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇవి అందుబాటులోకి కావడం ద్వారా ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పనున్నాయి.గ్రేటర్ పరిధిలో జాతీయ రహదారులపై నిర్మించిన రెండు వంతెనల ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. హైదరాబాద్-ముంబై జాతీయ రహదారి(65)పై బీహెచ్ఈఎల్ వద్ద జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) వంతెన నిర్మించింది. జనవరి 2023లో ప్రారంభమైన నిర్మాణ పనులు పూర్తి కావడంతో మే 5వ తేదీన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై అంబర్‌పేట వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్‌తో పాటు హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై శాతం రాయి, శంషాబాద్, తొండుపల్లి ప్రాంతాల్లో నిర్మించిన వంతెనలూ అదేరోజు ప్రారంభించనున్నారు. బీహెచ్ఈఎల్ ఫ్లై ఓవర్‌పై ట్రయల్ రన్‌లో భాగంగా 15 రోజులుగా వాహనాలను అనుమతిస్తున్నారు. వాహనాల వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

శంకుస్థాపన చేసిన గడ్కరీ చేతుల మీదుగానే ప్రారంభోత్సవం

అంబర్‌పేట వంతెనపై ఇప్పటికే వాహనాల రాకపోకలు సాగుతుండగా.. అధికారికంగా నితిన్ గడ్కరీ మే 5వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రారంభించనున్నారు. రూ.148 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులకు 2018లో గడ్కరీనే శంకుస్థాపన చేశారు. ఏడేళ్లుగా సాగిన పనులు ఎట్టకేలకు ఇటీవల పూర్తయ్యాయి. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించడానికి ముందు రూ. 148 కోట్ల అంచనా. ఆ తర్వాత రూ. 265.88 కోట్లకు అంచనా వేయగా పూర్తయ్యే సరికి రూ. 350 కోట్లకు చేరుకుంది. వంతెన నిర్మాణానికి 282 ఆస్తులను అధికారులు సేకరించారు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయినా.. సర్వీస్ రోడ్డు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో కింద నుంచి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

బెంగళూరు జాతీయ రహదారిపై..

నగరం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రధాన మార్గాల్లో హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి అత్యంత కీలకమైంది. ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు ఆరు వరసలతో కూడిన ప్రధాన రహదారితో పాటు సర్వీసు రోడ్లను ఎన్‌హెచ్ఏఐ నిర్మించింది. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల, గగన్‌పహాడ్, శాతం రాయి, శంషాబాద్, తొండుపల్లి ప్రాంతాల్లో జాతీయ రహదారి 44పై ఐదు ఫ్లై ఓవర్లను నిర్మించగా, ఇప్పటికే రెండింటిని ప్రారంభించారు. మిగతా మూడింటిని మే 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారు.

# ఉద్రిక్తతల నివారణకు దౌత్యమే శరణ్యం

ఇస్లామాబాద్, పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో భారత్, పాక్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. భారత్ ఎలాంటి తీవ్ర చర్యలు తీసుకుంటుందో అన్న భయాందోళనలు నెలకొన్నాయి. ప్రపంచదేశాలు సైతం పాక్‌ను దుమ్మెత్తి పోస్తున్నాయి. ఈ క్రమంలో ఈ పరిస్థితులను దౌత్య మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. రెండు అణ్వాయుధ దేశాల మధ్య శాంతిని పునరుద్ధరించేందుకు అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను వినియోగించుకోవాలని తన సోదరుడు, ప్రస్తుత ప్రధాని షెహబాజ్‌కు సూచించినట్లు వార్తలు వచ్చాయి. నవాజ్ నివాసంలో వీరి మధ్య సమావేశం జరిగింది పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు- పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు- మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది. ఈ దాడి తర్వాత పాక్ నేతలు ప్రేలాపనలు చేస్తున్నారు. భారత్‌పై దాడి చేసేందుకే 130 అణుబాంబులు సిద్ధంగా ఉంచినట్లు- పాకిస్థాన్ మంత్రి హనీఫ్ అబ్బాసీ బహిరంగ బెదిరింపులకు దిగారు. మతం, ఆచారాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షల్లో హిందూ, ముస్లింలు వేర్వేరు. వీటి ఆధారంగానే రెండు దేశాలు ఉండాలనే భావన ఏర్పడింది. పాకిస్థాన్ ఏర్పాటుకు పూర్వీకులు ఎన్నో త్యాగాలు చేశారు. వాటిని ఎలా కాపాడుకోవాలో మనకు తెలుసని పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. పాక్ మాజీ విదేశాంగ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ భిలావల్ భుట్టో జర్దారీ నోరు పారేసుకున్న సంగతి తెలిసిందే. సింధూ నదిలో నీరు పారకపోతే.. రక్తం పారుతుందంటూ ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. సింధూ నది తమదేనని, ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో నవాజ్ స్పందన వచ్చింది.

# లోకాయుక్త, ఉపలోకాయుక్తల ప్రమాణం

హైదరాబాద్,హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో లోకాయుక్త , ఉపలోకాయుక్తల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి , ఉపలోకాయుక్తగా బి.ఎస్.జగ్జీవన్ కుమార్ సోమవారం నాడు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ముఖ్యమైన కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , పలువురు ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి ,బి.ఎస్.జగ్జీవన్ కుమార్లు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తిస్తూ, రాష్ట్రంలో అవినీతిని నిరోధించడానికి కృషి చేస్తారని ఈ సందర్భంగా హాజరైన వారు ఆశాభావం వ్యక్తం చేశారు. వీరి నియామకం రాష్ట్ర పాలనలో మరింత పారదర్శకత , జవాబుదారీతనాన్ని పెంచుతుందని భావిస్తున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా పరిగణించబడుతోంది. లోకాయుక్త , ఉపలోకాయుక్తల నియామకంతో ప్రజలు తమ సమస్యలను, అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారించే ఒక ఉన్నత స్థాయి వేదికను ఆశించవచ్చు.

# ఇక బార్లలోనూ..ఒకే రేటు

అమరావతి,ఏపీలో మద్యం అమ్మకాల విషయంలో ఎక్సైజ్ శాఖ కొత్త ప్రతిపాదనలు చేసింది. నూతన బార్ పాలసీపై కసరత్తు మొదలు పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన విధానాల్లో మార్పులు సూచిస్తోంది. ఆగస్టుతో ముగియనున్న లైసెన్సుల గడువు ముగియనుంది. ఈ సారి ఫీజులు తగ్గించే యోచన చేస్తోంది. ఆదాయ నష్టం, అక్రమాల్లేని పాలసీ దిశగా కార్యాచరణ సిద్ధం చేస్తూనే.. కొత్త ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉంచుతోంది. అందులో భాగంగా మద్యం ధరల పైన పునరాలో చన చేస్తున్నట్లు తెలుస్తోంది.

నూతన పాలసీ

నూతన బార్ పాలసీపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పొరపాట్లు లేకుండా పక్కాగా అమలు చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా పలు ప్రతిపాదనలపై అధ్యయనం చేస్తోంది. గతంలో వైసీపీ ప్రభుత్వం 2022లో వేలం నిర్వహించి బార్లు కేటాయించే విధానం తీసుకొచ్చింది. దాని గడువు ఈ ఏడాది ఆగస్టుతో ముగుస్తుంది. అప్పట్లో రూ.50 లక్షలు, రూ.35 లక్షలు, రూ.15 లక్షలతో మూడు శ్లాబులతో బార్ పాలసీ ప్రకటించి.. వేలం నిర్వహించి అత్యధిక ధరకు పాడిన వారికి కేటాయించారు. అంతకుముందు దాదాపు రెండు దశాబ్దాలుగా బార్లను రెన్యువల్ చేస్తూ వచ్చారు. దీంతో ప్రభుత్వాలు మారినా లైసెన్సీలు వారే ఉంటూ వచ్చారు. 2022లో వేలం ద్వారా కొత్త లైసెన్సీలను ఎంపిక చేసింది.

ధరల విషయంలో

పలువురు అతి భారీ ధరకు వేలం పాడి బార్లు దక్కించుకున్నారు. రూ.15 లక్షల కనీస ధర ఉన్న బార్‌ను రూ.70 లక్షల వరకు.. రూ.35 లక్షల బార్‌ను రూ.కోటికి పైగా పాడి వేలంలో దక్కించుకు న్నారు. కానీ అంతంత ఎక్కువ ఫీజులతో వ్యాపారంలో నష్టం రావడంతో అనేక మంది మధ్యలోనే లైసెన్సులు వదిలేసుకున్నారు. ఫలితంగా రాష్ట్రంలో ప్రస్తుతం 53 బార్లు ఖాళీగా మిగిలిపోయాయి. దీంతో, బార్లకు కొత్తగా లైసెన్సులు జారీచేయాలా.. ఇప్పుడున్న వారికే రెన్యువల్ చేయాలా అనేదానిపై ఆలోచన చేస్తోంది. బార్లకు మళ్లీ కొత్తగా లైసెన్సుల కేటాయింపు అంటే వ్యాపారులు ఎక్కువ మంది ముందుకు రాకపోవచ్చనే వాదన వినిపిస్తోంది. ఒకవేళ కొత్త లైసెన్సులు ఇవ్వాల న్న నిర్ణయం తీసుకుంటే.. ఈసారి ఎక్కువ కాలానికి లైసెన్సులు మంజూరు చేయాలనే ప్రతి పాదన కూడా వచ్చినట్లు తెలిసింది. రెన్యువల్ కాకుండా కొత్త లైసెన్సులు జారీచేయాలనుకుంటే లాటరీ లేదా వేలంలో కేటాయించాల్సి ఉంటుంది.

ధరలపై తాజా ఆలోచన

ఇప్పుడు ప్రైవేటు షాపులు రావడంతో వ్యాపారం ఎక్కువ లాభసాటిగా ఉండకపోవచ్చనే అభిప్రాయం బార్ల వ్యాపారుల్లో ఉంది. అందుకే ఈసారి లైసెన్సు ఫీజులు కూడా తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక, మద్యం షాపులు, బార్లకు ఎక్సైజ్ శాఖే మద్యం సరఫరా చేస్తుంది. అయితే షాపులతో పోలిస్తే బార్లకు 10 శాతం అదనపు ధరకు విక్రయిస్తుంది. బార్లు, షాపులకు ఒకే ధరకు మద్యం అమ్మాలని మద్యం వ్యాపారులు చాలాకాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. కొన్ని చోట్ల బార్ వ్యాపారులు షాపుల నుంచి మద్యం తీసుకొచ్చి అక్రమంగా విక్రయిస్తున్నారు. వీటిని అరికట్టాలంటే షాపులు, బార్లకు సరఫరా

## పహల్గాం దాడిపై అనుచిత పోస్ట్

లక్నో,ప్రపంచ నేతలు, ప్రపంచ పౌరులు పహల్గాం దాడిని నిర్దందంగా ఖండిస్తుంటే, భోజ్‌పురి గాయని..నేహా సింగ్ రాథోడ్ మాత్రం భద్రతా వైఫలంయం అంటూ పోస్ట్ చేసింది. 26 మంది పౌరుల ప్రాణాలను బలిగొన్న ఇటీ-వలి పహల్గామ్ ఉగ్రవాద దాడి, ప్రభుత్వం, నిఘా, భద్రతా వైఫల్యం అని పేర్కొంటూ పోస్టులు పెట్టింది. దేశానికి తమ వంతు అండగా ఉండాల్సి భారత పౌరురాలు, గాయని అయి ఉండీ కూడా ఏ మాత్రం సిగ్గులేకుండా నిస్సిగ్గుగా మోదీ ప్రభుత్వంపై రాజకీయం చేస్తూ.. సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. పహల్గాం దాడి పేరుతో ప్రధాని మోదీ ఇప్పుడు బీహార్‌లో ఓట్లు- అడుగుతారని ఆమె చేసిన వీడియోను పాకిస్తాన్ జర్నలిస్టుల బృందం నిర్వహిస్తున్న హ్యాండిల్ తిరిగి పోస్ట్ చేయడంతో లక్నోలోని హజ్రత్‌గంజ్‌లో నేహాపై కేసు నమోదైంది. ఈ గాయని గతంలో కూడా ఇలాంటి సోషల్ మీడియా తప్పుడు మాటలు, తప్పుడు పోస్టులు చేసి వివాదాల్లో చిక్కుకుంది. అయినా ఈమెకు తెలిసిరాక, మళ్లీ దేశం మీద తెగబడింది.

## ఎంపీగా గుర్తించని టీడీపీ ఎమ్మెల్యేలు!

అమరావతి,బైరెడ్డి శబరి నంద్యాల ఎంపీ. కానీ ఈమెను కనీసం ఎంపీగా గుర్తించడానికి టీడీపీ ఎమ్మెల్యేలు నిరాకరిస్తున్నారు. పోనీ శబరి ఏమైనా ప్రతిపక్ష పార్టీ ఎంపీనా? అంటే , కానే కాదు. టీడీపీ తరపునే ఆమె నంద్యాల లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. నంద్యాల లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టీడీపీ అభ్యర్థులే గెలుపొందారు. నంద్యాల ఎమ్మెల్యే, మంత్రి ఫరూక్‌తో మినహా మిగిలిన ఏ ఒక్కరితోనూ ఆమెకు సత్సంబంధాలు లేవు.నంద్యాల లోక్‌సభ పరిధిలో ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, నంద్యాల, పాణ్యం, బనగానపల్లె, శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. నంద్యాల పార్లమెంట్ పరిధిలో శబరి పర్యటిస్తే, ఆమె కార్యక్రమంలో పాల్గొనకూడదని టీడీపీ ఎమ్మెల్యేలు తమ అనుచరులకు వార్నింగ్ ఇస్తుండడం చర్చనీయాంశమైంది. అందుకే శబరి నంద్యాల పార్లమెంట్ పరిధిలో పర్యటించినా టీడీపీ నాయకులెవరూ కనిపించడం లేదు.గతంలో నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షురాలిగా శబరి పని చేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరి నంద్యాల లోక్‌సభ స్థానాన్ని దక్కించుకున్నారు. కూటమి సునామీలో ఆమె అత్యున్నత చట్టసభకు ఎన్నికయ్యే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఎంపీ అయిన తర్వాత లోక్‌సభ పరిధిలో ఎక్కడికెళ్లినా, కనీసం ఆమెను పలకరించే పరిస్థితి లేదంటే, విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.శబరికి స్థానం ఇస్తే, నెత్తినెక్కి కూచుంటారనే భయమే ఆమెను సొంత పార్టీ నేతలు దూరం పెట్టేలా చేసిందనే వాదన వినిపిస్తోంది. కానీ ఎన్నికల సందర్భంలో తామిచ్చిన డబ్బు మాత్రం నిర్మొహమాటంగా తీసుకున్నారని, అప్పుడు ఈ పౌరుషం ఏమైందని శబరి అనుచరులు నిలదీస్తున్నారు. టీడీపీకి ఎన్నికల ఫండ్ కింద రూ.70 కోట్లు, ఇది కాకుండా ఎన్నికల్లో రూ.80 కోట్లు మొత్తం రూ.150 కోట్లు పెట్టి ఎంపీ సీటును కొనుక్కున్నట్టైందని శబరి అనుచరులు వాపోతున్నారు.భారీ మొత్తంలో ఖర్చు పెట్టి, ఎంపీగా గెలుపొంది ప్రజా సమస్యల పరిష్కరిద్దామని క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంటే ఏ ఒక్క ప్రజాప్రతినిధి రావడం లేదని మండిపడుతున్నారు. నందికొట్కూరులో మాండ్ర శివానందరెడ్డి అనుచరుడు గిత్తా జయసూర్య ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక్కడ బైరెడ్డి, ఎమ్మెల్యే వర్గాలు వేర్వేరుగానే రాజకీయాలు చేస్తుండడం గమనార్హం. నంద్యాలలో మాత్రం మంత్రి ఫరూక్ కలుపుకుని వెళ్తున్నారు.మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో శబరిని ప్రత్యర్థిగానే టీడీపీ ఎమ్మెల్యేలు చూసే పరిస్థితి. వామ్మో బైరెడ్డి వాళ్లను భరించలేం బాబోయ్ అని దూరం జరుగుతున్నారు. అదే నిజమైతే ఎన్నికల్లో తామిచ్చిన డబ్బును ఎందుకు తీసుకున్నారనేది శబరి, ఆమె అనుచరుల ప్రశ్న. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి వారసురాలిగా శబరి రాజకీయాల్లోకి వచ్చారు. తండ్రి మాదిరిగానే శబరిలో వెటకారం ఎక్కువే. పబ్లిసిటీ అటెన్షన్ ఎక్కువనే విమర్శ వుంది. కాస్త చోటిస్తే అందరినీ తొక్కేస్తారనే భయం టీడీపీ ప్రజాప్రతినిధుల్ని వెంటాడుతోంది.

## కీలక పాత్ర పోషిస్తాడా?

హైదరాబాద్,మావోయిస్టులతో రేవంత్? రెడ్డి ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలన్న డిమాండ్? మళ్లీ ముందుకు వచ్చింది. తమతో ప్రభుత్వం చర్చలు జరపాలని మావోయిస్టులు కోరుకుంటున్నారు. పౌర హక్కుల సంఘాల నాయకులు, మేధావులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలు కోరుతున్నారు. మరోపక్క మావోయిస్టులను సమూలంగా నిర్మూలించాలని కేంద్ర హోం మంత్రి అమిత్?షా కంకణం కట్టుకున్నాడు. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను సమూలంగా నిర్మూలిస్తామని ఆయన ప్రకటనలు చేస్తున్నాడు.ఈ మధ్య కాలంలో భద్రతా బలగాల ఎన్?కౌంటర్లలో, దాడుల్లో మావోయిస్టులు భారీగా ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసులు వెంటాడి, వేటాడి వారిని హతమారుస్తున్నారు. దీంతో మావోయిస్టుల బలం నానాటికి తగ్గిపోతోంది. ప్రాణభయం ఎక్కువైంది. చత్తీస్?గఢ్? లో మావోయిస్టుల నిర్మూలన కోసం 'ఆపరేషన్? కగార్ '? పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న యుద్ధంలో పెద్ద సంఖ్యలో మహిళా మావోయిస్టులు కన్నుమూస్తున్నారు.వచ్చే ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టులను తుదముట్టిస్తా మన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆదేశాల మేరకు దండకారణ్యంలో భారీ ఎత్తున దిగిన బలగాలు వరుస ఎన్?కౌంటర్లతో విరుచుకుపడుతున్నాయి. ఆపరేషన్? కగార్? ప్రారంభమైన 2024 జనవరి నుంచి ఇప్పటివరకు 303 మంది మావోయిస్టులు చనిపోగా, వీరిలో ఏకంగా 102 మంది మహిళలున్నారు. మరోవైపు మావోయిస్టుల ఏరివేతకు సైతం లొంగిపోయిన మహిళా నక్సల్స్‌ను వాడుకుంటున్నారు. ఆపరేషన్? కగార్ ?ను నిలిపేయాలని చాలామంది డిమాండ్? చేస్తున్నారు.ఇటీవల కర్రెగుట్టల్లో కూడా భారీ ఎన్?కౌంటర్? జరిగినట్లు సమాచారం వచ్చింది. దీంతో పౌరహక్కుల సంఘాల నాయ కులు, తదితరులు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని రేవంత్? రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. దీనిపై మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని రేవంత్? రెడ్డి వారికి చెప్పాడు. ఈ సందర్భంగా ఆయన పార్టీ సీనియర్? నాయకుడు, మాజీ మంత్రి జానారెడ్డి పేరు ప్రస్తావించాడు. గతంలో మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపిన అనుభవం జానారెడ్డికి ఉందన్నాడు. అందుకే ఈ విషయంలో ఆయన సలహాలు, సూచనలు తీసుకొని ముందుకు పోతామన్నాడు.మరి జానారెడ్డిని సలహాలు ఇవ్వడానికే పరిమితం చేస్తారా? లేదా చర్చల్లో ఆయన్ని కూడా భాగస్వామిని చేసి కీలకపాత్ర పోషించే విధంగా చేస్తారా? చూడాలి. ఇక మావోయిస్టుల విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం లది ఒక్కొక్కరిది ఒక్కో వైఖరి. 1982లో ఎన్‌టీఆర్ మావోయిస్టులను దేశభక్తులుగా అభివర్ణించారు. 1989లో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి చెన్నారెడ్డి కూడా మావోయిస్టును దేశభక్తులని చెప్పారు.ఆ తర్వాత సీఎం చంద్రబాబు వైఖరి ఎన్‌టీఆర్, చెన్నారెడ్డిలకు పూర్తిగా భిన్నం. ఆయన మావోయిస్టుల గ్రూపులను నిషేధించారు. వారిపై యుద్ధమే ప్రకటించారు. చంద్రబాబు హయంలో మావోయిస్టులు, పోలీసులకు మధ్య పెద్ద యుద్ధమే నడిచింది. అలిపిరి వద్ద చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌ను మావోయిస్టులు పేల్చడం దేశవ్యాప్తంగా నాడు పెను ప్రకంపనలు రేపింది.ఆ తర్వాత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మావోయిస్టులతో ఏకంగా చర్చలు జరిపారు. అయితే అవి విఫలయ్యాయి. ఒకవేళ రేవంత్? రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిగితే మాత్రం అవి గతంలో మాదిరిగా విఫలం కాకూడదు.


# నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సాగిన రైతు ఉద్యమం ఏం నేర్పుతోంది ?

జుల్కై 2020 నుంచి డిసెంబరు 2021 వరకు దేశంలో అతి పెద్ద రైతాంగ ఉద్యమం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన మూడు వ్యవసాయక చట్టాలకు వ్యతిరేకంగా పంజాబ్, హర్యానా, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి రైతాంగం ఆందోళనకు దిగింది. వ్యవసాయోత్పత్తుల అమ్మకం, వాణిజ్య (ప్రోత్సాహం, వెసులుబాటు) చట్టం, రైతు సేవలు, ధరల భరోసా ఒప్పంద చట్టం, నిత్యావసర సరుకుల(సవరణ)చట్టం ఈ మూడు చట్టాలను రైతాంగం వ్యతిరేకించింది.

ఈ ఉద్యమంలో ప్రథమ శ్రేణిలో నిలిచి అటు రైతాంగ ప్రయోజనాలకు, ఇటు వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలకు ప్రతినిధులుగా ఉన్న వారి మనోభావాలను, అభిప్రాయాలను యధాతథంగా ఇచ్చేందుకు ఈ అధ్యాయంలో ప్రయత్నం చేశాము. 13 నెలల పాటు సాగిన ఆ పోరాటంలో రైతులు, రైతు ఉద్యమ కార్యకర్తలు, నాయకుల మనోభావాలు, ఎదుర్కొన్న సమస్యలు, అధిగమించిన పరిస్థితుల గురించిన ప్రత్యక్ష కథనాలు, వాటి సారాంశం ఇక్కడ పొందుపర్చాము. ఉద్యమం ముగిసిన నెల రోజుల తర్వాత 2022లో సవివరమైన ప్రశ్నావళితో రైతు ఉద్యమకారులను కలిశాము. వివరాలు సేకరించాము. ఓ చిన్న ప్రతిస్పందన, నిరసన కార్యక్రమం దేశవ్యాప్తంగా రైతాంగాన్ని కదిలించే ఉద్యమంగా ఎలా మారిందో వివరించేందుకు ఈ అధ్యాయంలో ప్రయత్నం చేశాము. ఈ ఉద్యమకాలంలో భిన్న సంఘాలు, భిన్న సామాజిక తరగతులకు ప్రాతినిధ్యం వహించే సంస్థల నుంచి తమ ఉద్యమానికి మద్దతు సమీకరించే ప్రయత్నంలో రైతు ఉద్యమ నాయకత్వానికి ఎదురైన అనుభవాలు, ఉద్యమకాలంలో నాయకత్వం నేర్చుకున్న పాఠాలపై దృష్టి పెట్టాము.ఉద్యమ భాగస్వామ్యంలో ఉన్న వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఇంటర్వ్యూలు కూడా ఉద్యమంలో పాల్గొన్న సంఘాలు, సంస్థలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, వారి భిన్న సామాజిక నేపథ్యాలకు ప్రాతినిధ్యం ఉండేలా ఎంపిక చేశాము. ఇందులోనే వివిధ సంఘాల్లో నాయకత్వ స్థానాల్లో ఉన్న మహిళలను కూడా కలిసి ఇంటర్వ్యూలు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధతో ప్రయత్నం జరిగింది. మేము ఇంటర్వ్యూ చేసిన వారు ఉద్యమకాలంలో రకరకాల బాధ్యతలు నిర్వహించారు. కొందరు జనసమీకరణపై దృష్టి పెడితే మరికొందరు ఉద్యమానికి అవసరమైన ధన సమీకరణ కోసం కృషి చేశారు. మరికొందరు ఉద్యమ శిబిరంలో ఉన్న వారికి కనీస అవసరాలు సమకూర్చటానికి కృషి చేశారు. మరికొందరు ఉద్యమకేంద్రాల్లో కావల్సిన వేదికలు, విద్యుత్ అవసరాలు, మైకులు వంటి ఏర్పాటు బాధ్యతలు తీసుకున్నారు.

తేజ్‌వీర్ సింగ్, 18 జనవరి 2022

తేజ్ వీర్ సింగ్ హర్యానాలోని అంబాలాకు చెందిన రైతు. సామాజిక ఉద్యమాల్లో క్రియాశీలకంగా ఉండే కుటుంబం నుంచి వచ్చారు. ఉద్యమం మొదటి నుంచి చివరి వరకూ ఉన్నారు. తానుగా ఏ రైతు సంఘంలోనూ సభ్యుడు కాకపోయినా భారతీయ కిసాన్ యూనియన్‌కు సంఘీభావంగా నిలిచారు. చారుణి నాయకత్వంలో ఉన్న ఈ యూనియన్ హర్యానాలో పని చేస్తున్న రైతు సంఘాల్లో రెండో పెద్ద సంస్థ. మొదటి రోజు నుంచి కేంద్ర ప్రభుత్వం రైతాంగంపై యుద్ధం ప్రకటించింది అని తేజ్ వీర్ అభిప్రాయపడ్డారు. అందుకే తను తన మిత్రబృందంతో కలిసి మొత్తం ఉద్యమకాలం 13 నెలలు రంగంలో ఉన్నారు. గతంలో కూడా ఇటువంటి సుదీర్ఘ ఉద్యమాలు నిర్మించి పోరాటాలు చేసిన అనుభవం తేజ్‌వీర్‌కు ఉంది. ఉదాహరణకు 2010లో ఇండస్ట్రియల్ మోడల్ టౌన్‌షిప్ నిర్మాణం కోసం జరిగిన బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన నడిపారు.పంజాబ్, హర్యానా కేంద్రంగా పని చేస్తున్న రైతు సంఘాలు మొదటిసారిగా 2020 జుల్కై 20న ఆందోళనకు పిలుపునిచ్చాయని గుర్తు చేసుకున్నారు. ఆ రోజు ట్రాక్టర్లతో నిరసన ప్రదర్శన చేయాలన్నది పిలుపు. 750 ట్రాక్టర్లతో రైతులు కదిలివచ్చారు. అదే రోజున రోటొవేటర్లు కొనడానికి



ఇచ్చే సబ్సిడీ రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటన విన్న తర్వాత 2020 ఆగస్టు 15న నిరసన దినంగా పాటించాలని నిర్ణయించాము. ఒక్క అంబాలాలోనే 7,500 మంది రైతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అలా మొదల్కెంది ఉద్యమం అన్నారు తేజ్‌వీర్."ఈ ఆందోళన ఓ ముందస్తు పథకం ప్రకారం నిర్మితమైంది కాదు. 2020 నవంబరు 5న పార్లమెంట్ ఈ నల్ల చట్టాలను ఆమోదించటంతో నిరసనగా రాస్తా రోకో చేయాలని నిర్ణయించాము. పార్లమెంట్ ఆమోదించిన బిల్లులపై రాష్ట్రపతి సంతకాలు చేసిన నవంబరు 25న భారత్ బంద్‌కు పిలుపునిచ్చారు. అక్టోబరు 17న జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నాము" అని తేజ్‌వీర్ తెలిపారు."అప్పటికి మా ముందున్న మార్గం ఒక్కటే. ఉద్యమబాటలో ముందుకు పోవడమా లేక చావడమా. మా ప్రదర్శనను పోలీసులు ఎక్కడ ఆపితే అక్కడ ఆగాలని నిర్ణయించుకున్నాము. ఈ ప్రయత్నంలో చిన్నచిన్న ఘర్షణలు జరిగాయి. బారికేడ్లు పగలగొట్టడం, కొందరు పంజాబీ యువత పోలీసులపై దాడులు చేయటం వంటివి. ఇంతలో పెద్దలు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ప్రభుత్వం, దాని విధానాలు మన శతృవులు తప్ప ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు శతృవులు కాదని విడమర్చి పోరాటపథంలో ఉన్న యువతను శాంతింపచేశారు."ప్రభుత్వంతో చర్చలు విఫలమయ్యాక మరింత మంది రైతులు ఢిల్లీ సరిహద్దులకు చేరుకున్నారు. ఢిల్లీ బయల్దేరిన రైతాంగాన్ని నిలువరించటానికి భాష్పవాయుగోళాలు, నీటి పంపులతో దాడులు వంటి పలు ప్రయత్నాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేశాయి. అయినా వీటికి వెరవకుండా రైతాంగం ఎక్కడివారు అక్కడే నిరసనకు దిగారు.వివిధ రైతు సంఘాలతో ఏర్పాట్కెన కిసాన్ ముక్తి మోర్చా దేశవ్యాప్తంగా ఈ చట్టాల వలన రైతాంగానికి, ఆర్థిక వ్యవస్థకు వచ్చే నష్టాన్ని తెలియచేస్తూ ప్రచారం చేయటంలోనూ, ఢిల్లీ సరిహద్దుల్లో జరుగుతున్న ఉద్యమానికి అన్నిరకాల మద్దతులు సమకూర్చటంలోనూ ప్రధాన సహాయక సహకారాలందించారని తేజ్‌వీర్ అన్నారు. పంజాబ్, హర్యాల్లో పెద్ద సంఘాలుగా ఉన్న ఉగ్రహాన్, దకుండాల నేతృత్వంలోని సంఘాలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వామ్యం వహించాయి. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న రైతాంగానికి ఈ ఉద్యమం విశ్వాసం కలిగించింది. 'ఉత్తరప్రదేశ్ రైతాంగం స్థానికంగా మార్కెట్ యార్డులు లేకపోవటంతో తమ ఉత్పత్తులు అమ్ముకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది'అనే ఉదాహరణలు ఈ చట్టాలు తెచ్చిపెట్టే సమస్యలను అర్థం చేసుకోవడానికి రైతాంగానికి బాగా ఉపయోపడ్డాయి.

ఉద్యమానికి అవసరమైన నిధులను చందాల రూపంలో సేకరించాయి "గ్రామ గ్రామాన ఈ ఉద్యమం పోరాటం ఎందుకో వివరించి గ్రామస్తుల నుంచి చందాలు సేకరించాము. ట్రాక్టర్ రాలీ జరపాలంటే ప్రతి గ్రామం నుంచి 2100 రూపాయలు వసూలు చేసేవాళ్లం. ఆగస్ట 15న నిరసన పాటించటానికి అయ్యే ఖర్చు సమకూర్చుకోవటంలో భాగంగా గ్రామం నుంచి 500 రూపాయలు చొప్పున సేకరించాము. భవిష్యత్తులో ఇటువంటి ట్రాక్టర్ ర్యాలీలు జరిగినప్పుడు అయ్యే ఖర్చుల కోసం ప్రతి కుటుంబం కొంత పొదుపు చేయాలని కూడా నిర్ణయించాము.

## తిరుమలలో చెప్పుల తిప్పలకు చెక్

తిరుమల,తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్ళే భక్తులు ఎవరూ చెప్పులు ధరించరు. తిరు మాఢ వీధులలో కూడా భక్తులు చెప్పులు వేసుకుని నడవరు. శ్రీవారి ఆలయ పరిసరాలు, అన్నదానం ప్రాంతాలను భక్తులు అంత పవిత్రంగా భావిస్తారు. దీంతో తిరుమల వచ్చిన భక్తులకు చెప్పులు ఎక్కడ వదలాలి అన్నది పెద్ద టాస్క్ అని చెప్పాలి. అందుకోసం తిరుమలలోని పలు రద్దీ ప్రాంతాలలో టీటీడీ చెప్పుల స్టాండ్లు ఏర్పాటు చేసింది. రాంబగీచా, అన్నదానం, ఏటీసీ సర్కిల్, కళ్యాణకట్ట తదితర ప్రాంతాలలో చెప్పుల స్టాండ్?లు ఉన్నాయి. అయినా తిరుమలలో చాలా ప్రాంతాలలో చెప్పులు కుప్పలు కుప్పలుగా కనిపిస్తుంటాయి. చెప్పుల స్టాండ్లు చూస్తే అదో పద్మవ్యూహాన్ని తలపిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి కాదేమో. అక్కడ చెప్పులు వదలడమేగాని తిరిగి వాటిని మనం కనుక్కోవడం అసాధ్యం.దీంతో.. ఈ చెప్పుల సమస్యపై టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి దృష్టి సారించారు. చెప్పుల సమస్యకు శాశ్వత పరిష్కారం ఆలోచించారు. ప్రస్తుతం టీటీడీ ఉచిత లగేజి కౌంటర్‌లో ఉపయోగించే ఆర్ఎఫ్ఐడి సిస్టం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఏటీసీ సర్కిల్‌లో ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. కౌంటర్ పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తుల చెప్పులు వదిలి వెళ్లేటప్పుడు వారి ఫోటోతోపాటు మొబైల్ నెంబర్ ఫీడ్ చేసి స్లిప్ ఇస్తారు. చెప్పులను ఆర్ఎఫ్ఐడి ఉన్న బ్యాగ్ లో వేసి ర్యాక్ నెంబర్ ఆధారంగా స్కాన్ చేసి భద్రపరుస్తారు. భక్తులు దర్శనం అయ్యాక తిరిగి వచ్చి స్లిప్ చూపిస్తే స్కాన్ చేసి కౌంటర్‌లో, ఏ వరుసలో ఏ ర్యాక్‌లో ఆనంబర్ గల చెప్పులు ఉన్నాయో ఈజీగా గుర్తించి భక్తులకు తిరిగి అందిస్తున్నారు సిబ్బంది. అటు భక్తులను, ఇటు టీటీడీ సిబ్బంది నుంచి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. 98 శాతం మంది భక్తులు తమ చెప్పులను తిరిగి తీసుకువెళుతున్నామని చెప్పారు. దీంతో నూతన విధానం విజయవంతంగా అమలవుతోందని, మరో నాలుగు ప్రాంతాలలో ఇదే తరహాలో చెప్పుల కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తెలిపారు.

## పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయాం

శ్రీనగర్,పహల్గామ్ ఉగ్ర దాడిని ఖండిస్తూ జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ తీర్మానం చేసింది. మృతులకు ఘనంగా నివాళి అర్పించింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర ప్రసంగం చేశారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత దేశంలోని ప్రతి ప్రాంతం ఆవేదనకు గురైందన్నారు. ఉత్తరం నుంచి దక్షిణం వరకు.. తూర్పు నుంచి పడమర వరకు ఇలా ప్రతి ప్రాంతం దిగ్భ్రాంతికి గురైందని గుర్తుచేశారు. ఉగ్ర దాడి తర్వాత కాశ్మీర్ అంతా ఐక్యంగా ఉందని గుర్తుచేశారు. ఇక లోయలో ఉగ్రవాదం అంతం కావడం ఖాయమన్నారు. ఇక ఉగ్ర దాడిలో చనిపోయిన 26 మంది పేర్లను సభలో చదివి వినిపించారు. ఈ దాడిలో తండ్రులను కోల్పోయిన పిల్లలకు తాను ఏం సమాధానం చెప్పాలని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం బాధ్యతగా పర్యాటకులను ఆహ్వానించింది.. కానీ వారికి భద్రత కల్పించలేకపోయామన్నారు. క్షమాపణ చెప్పడానికి కూడా మాటలు రావడం లేదని.. తండ్రులను కోల్పోయిన పిల్లలకు గానీ.. భర్తలను కోల్పోయిన వితంతువులకు ఏం సమాధానం చెప్పాలన్నారు. తాము ఏం తప్పు చేశామని వాళ్లంతా అడుగుతున్నారని.. సమాధానం చెప్పలేకపోతున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అతిథులను కాపాడటంలో తాను విఫలమయ్యానని జమ్మూకశ్మీర్‌కు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. కానీ, ఆ 26 మంది ప్రాణాలను అడ్డం పెట్టుకొని తాను రాష్ట్రహోదాను డిమాండ్ చేయబోనని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని జాతి తీవ్ర వేదనల్లో ఉన్నప్పుడు కాకుండా.. మరేదైనా రోజు లేవనెత్తుతానని చెప్పారు.పహల్గాం దాడిపై చర్చించేందుకు అక్కడి అసెంబ్లీ నేడు అత్యవసరంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ఇలాంటి దాడులు గతంలో చాలా చూశాం. కానీ, బైసరన్‌లో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 21 ఏళ్లలో ఇదే తొలిసారి. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదు. రాష్ట్రానికి వచ్చిన పర్యాటకులను సురక్షితంగా తిరిగి పంపాల్సిన బాధ్యత మాదే. నేను ఆ పనిచేయలేకపోయాను. క్షమాపణలు చెప్పేందుకు నా వద్ద మాటలు కరవయ్యాయిపహల్గాం ఘటన తర్వాత ఏ ముఖం పెట్టు-కొని రాష్ట్రహోదాను డిమాండ్ చేయాలి. నా రాజకీయాలు అంత చౌకబారువి కాదు. గతంలో రాష్ట్ర హోదా అడిగాము.. భవిష్యత్తులో కూడా అడుగుతాము. కానీ, 26 మంది చనిపోయారు.. ఇప్పుడు రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటన్నారు. ప్రజలు మాకు మద్దతు ఇస్తే.. మిలిటెన్సీ, ఉగ్రవాదం అంతమవుతాయి. ఇది దానికి ఆరంభం. ఈ ఉద్యమానికి హాని కలిగించేది ఏదీ మాట్లాడకూడదు, చేయకూడదు. మేము మిలిటెన్సీని తుపాకులతో అదుపు చేయగలం.. కానీ, మాకు ప్రజల మద్దతు అవసరం అని అబ్దుల్లా అసెంబ్లీలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, పర్యాటకశాఖ మంత్రిగా వారి కాపాడలేకపోయానన్నారు. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని బైసరన్ లోయలో సేదతీరుతున్న పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఈ క్రమంలో వారి మతం అడిగి మరీ ఈ దారుణానికి ఒడిగట్టడం సంచలనంగా మారింది.ప్రభుత్వ చర్యలకు ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ ప్రశంసించారు. అలాగే ఉగ్రవాద దాడిని ఖండించారు. అఖిలపక్ష సమావేశాన్ని పిలిచినందుకు ముఖ్యమంత్రిని, ప్రత్యేక సమావేశాన్ని పిలిచినందుకు అసెంబ్లీ స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్‌ను ప్రశంసించారు.

# పాక్ పాచికల్ని పారనీయొద్దు!



న్యూఢిల్లీ,పహల్గామ్‌లో 26 మంది నిండు ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రదాడిపై ప్రతీకారం తీర్చుకోవాల్సిందేనన్న అభిప్రాయం రోజురోజుకూ దేశంలో బలపడుతుండగా పాకిస్తాన్ మరింత రెచ్చగొట్టేలా మాట్లాడుతోంది. మొదటి నాలుగు రోజులూ ఉలకని, పలకని ఆ దేశం అటుతర్వాత 'తటస్థ దర్యాప్తు' రాగం అందుకుంది. ఆ మర్నాడే అణు బెదిరింపులకు దిగింది. మరోపక్క భద్రతా మండలిలో చడీచప్పుడూ లేకుండా లాబీయింగ్ సాగించి తన పాచిక పారేలా చూసుకుంది. ఇక్కడే మన లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని 'తీవ్రంగా' ఖండిస్తు న్నట్టు తీర్మానం చెబుతున్నా అందులో దాడికి కారణమైన 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్) సంస్థ పేరు ప్రస్తావనే లేకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. చైనా ఎప్పటిలాగే పాకిస్తాన్ వాదనతో శ్రుతి కలిపింది. కానీ మన కు చాలా సన్నిహితుడనుకున్న డోనాల్డ్ ట్రంప్ ఏలుబడి అమెరికాలో మొదలైనా పాక్‌తో ఆ దేశం అంటకాగుతున్న వైనం దిగ్భ్రాంతికరం కాదా? ఈమధ్యకాలంలో బలూచిస్తాన్‌లో రైలును దారిమళ్లించి అనేకుల్ని హతమార్చిన ఉదంతంలో భద్రతామండలి అందుకు కారణమైన బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పేరు ప్రస్తావించింది. 2019లో పుల్వామాలో జరిగిన ఉగ్రదాడి ఉదంతంలో సైతం జైషే మొహమ్మద్ (జేఈఎం) ప్రమేయాన్ని మండలి తీర్మానం ఎత్తి చూపింది. కానీ ఇప్పుడేమైంది? ఇక్కడికొచ్చేసరికి ఈ నీళ్ల నములుడు దేనికి? అమెరికా రూపొందించిన తీర్మానంలో తొలుత ప్రస్తావనకొచ్చిన టీఆర్ఎఫ్ పేరు ఎందుకు ఎగిరిపోయింది? ఏ సంస్థనూ మాటమాత్రంగానైనా ఖండించటానికి ముందుకురాని తీర్మానం 'అంతర్జాతీయ శాంతికీ, భద్రతకూ విఘాతం కలిగించే ఉగ్ర ఘాతుకాలపై అన్నివిధాలుగా పోరాడతాం' అని బడాయి పోవటం చిత్రం కాదా! ఆ ఘనకార్యం మేమే చేశామని విర్రవీగిన సంస్థ పేరెత్తటానికి మండలికున్న అభ్యంతర మేమిటి? అఫ్గాన్‌లో సోవియెట్ సైన్యాన్ని ఎదుర్కొనటానికి అమెరికా ఆశీస్సులతో ఉగ్రవాద శిబిరాలు నడిపిన పాపిష్టి చరిత్ర తమకుందని ఈమధ్యే పాక్ రక్షణమంత్రి అంగీకరించాడు. తాజా పరిణామాల నేపథ్యంలో అలాంటి లాలూచీ ఇంకా కొన సాగుతున్నదనుకోవాలా? ప్రధాని నరేంద్ర మోదీ మొన్న బిహార్‌లో కావొచ్చు... తాజాగా 'మన్ కీ బాత్'లో కావొచ్చు, పహల్గామ్ ఉదంతంలో బాధితులకు సరైన న్యాయం దక్కేలా చేస్తామని స్పష్టం చేశారు. పాత్ర ధారుల్ని, సూత్రధారుల్ని తీవ్రాతితీవ్రంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. మంచిదే. అయితే ఈ కృషి బహుముఖాలుగా వుండాలి. ఉగ్రవాదుల్ని పట్టి బంధించటానికి ప్రయత్నించటంతో పాటు అంతర్జాతీయంగా పాక్‌ను ఏకాకిని చేయటానికి కృషి చేయాలి. ఉగ్రసంస్థల్ని కిరాయి ముఠాలుగా వాడుకుంటున్న దాని నైజాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టాలి. పాకిస్తాన్ తెరవెనకుండి భద్రతామండలి తీర్మానంలో చేయించిన మార్పులు చిన్నవేమీ కాదు. ఉగ్ర సంస్థ టీఆర్ఎఫ్‌తో పాక్ సర్కారు ఎంతగా చెట్టపట్టాలు వేసుకున్నదో మండలిలో జరిగిన పరిణామాలే తేటతెల్లం చేస్తున్నాయి. తీర్మానంలో టీఆర్ఎఫ్ ప్రస్తావన లేకుండా చేసిన క్షణాల్లోనే ఆ ఉగ్ర సంస్థ తన పాత ప్రకటన 'అధికారికమైనది' కాదంటూ స్వరం మార్చటం గమనించదగ్గది. దాడి జరిగిన వెంటనే తామే అందుకు కారకులమని చెప్పిన ఆ సంస్థ మండలిలో పాక్ వాదనకు అనుగుణంగా ఆ ప్రకటన తమది కాదనటమే కాదు... నింద మోపటం కోసం భారత సైన్యం కావాలని చేసిన పనిగా ఆ ఉదంతాన్ని వక్రీకరించే ప్రయత్నం చేసింది. లష్కరే తోయిబా విషపుత్రిక అయిన టీఆర్ఎఫ్ 2020 నుంచీ జమ్మూకశ్మీర్‌లో అనేక దాడులకు పాల్పడుతోంది. ఆ సంస్థను మన దేశం నిషేధించింది కూడా! ఏదో విధంగా మన దేశాన్ని ఇబ్బందులపాలు చేయటం కోసం ఏళ్ల తరబడి స్వయంగా నిర్మించిన ఉగ్రవాద సాలెగూటిలో తానే చిక్కుకుని పాకిస్తాన్ తరచు విలవిలలాడుతోంది. 2015లో పెషా వర్ కంటోన్మెంట్ ప్రాంతంలోని పాఠశాలపై ఉగ్రవాదులు ఒక్కుమ్మడిగా విరుచుకుపడి 140 మంది బాలబాలికల్ని కాల్చిచంపారు. ఆ మరుసటి ఏడాది క్వెట్టాలో పోలీసు శిక్షణ కేంద్రం ఆవరణలోకి ప్రవేశించి 60 మందిని హతమార్చారు. ఒక యూనివర్సిటీపై దాడికి దిగి ప్రొఫెసర్‌తోపాటు 20 మంది విద్యార్థుల ప్రాణాలు తీశారు. ఈ మాదిరి ఉదంతాలు ఎన్నెన్నో. అయినా పాకిస్తాన్ వైఖరిలో ఆవగింజంతైనా మార్పు లేదు. పశ్చాత్తాపం అసలే లేదు. పహల్గామ్ దాడిని ఖండించకుండా పర్యాటకులు ప్రాణాలు కోల్పోవటం విచారకరమంటూ ప్రకటన చేసి చేతులు దులుపుకుంది.పాకిస్తాన్ తీరు మారదని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దబాయింపు చూస్తే తెలుస్తుంది. ఉగ్రదాడిపై ఆయనగారికి 'తటస్థ, పారదర్శక, విశ్వసనీయ' దర్యాప్తు కావాలట! అసలు తన ఎన్నికే సంశయాస్పదమైంది. పాక్ సైన్యం అండదండలతో అందలమెక్కిన చరిత్ర షెహబాజ్‌ది. 2016నాటి పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత జరిగిన ఇరు దేశాల సంయుక్త దర్యాప్తును నీరు గార్చిందెవరు? పాక్ ప్రతినిధులు మన దేశం వచ్చి దర్యాప్తులో పాల్గొని వెళ్లగా, మన ప్రతినిధి బృందాన్ని మాత్రం పాక్ గడ్డపైకి అనుమతించని వైనం, తాము సేకరించిన సాక్ష్యాలను భారత్‌తో పంచుకోని తీరు షెహబాజ్ మరిచారా? 2008 నాటి ముంబై పేలుళ్ల ఉదంతంలో ఇచ్చిన సాక్ష్యాధారాలకు ఏ గతి పట్టించారో గుర్తులేదా? అణ్వాయుధ దాడికి సిద్ధమంటూ బెదిరింపులకు దిగుతున్న పాక్ దుష్ట పన్నాగాలను ప్రపంచ దేశాలకు తెలియజెప్పాలి. అందుకు దౌత్యపరంగా మరింత కృషి చేయాలి. దాంతోపాటు అన్నివిధాలా సంసిద్ధతలు పెంపొందించుకోవాలి. సామాజిక మీడియాలో కశ్మీరీలపై విద్వేషాన్ని కక్కే అవాంఛనీయ శక్తుల ఆటకట్టించాలి. ఇది కలసికట్టుగా నిలబడాల్సిన కాలమని చాటాలి.

## తిరుపతి జిల్లాలో ఘోరరోడ్డు ప్రమాదం

తిరుపతి,ఆంధ్రప్రదేశ్‌లో మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. తిరుపతిలో జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో అక్కడిక్కడే ఐదుగురు మృతిచెందారు.. ఈ ఘటనలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి.. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై పాకాల మండలం తోటపల్లి దగ్గర ఘోరు ప్రమాదం చోటు చేసుకుంది.. కం-టైనర్ వాహనం కిందకు దూసుకెళ్లింది కారు.. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.. ప్రమాదంలో మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా.. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు, 9 ఏళ్ల బాలుడు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు.. అందరూ ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు.. ప్రమాదానికి గురైన వాహనం.. తమిళనాడు రిజిస్ట్రేషన్ నంబర్ కలిగి ఉండడంతో.. మృతులు కూడా ఆ రాష్ట్రానికి చెందినవారిగానే అనుమానిస్తున్నారు..

# పాకిస్తాన్‌ను వదిలే ప్రసక్తే లేదు.. ఐరాసలో భారత్ హెచ్చరిక



న్యూయార్క్: అంతర్జాతీయ వేదికపై దాయాది దేశం పాకిస్తాన్‌కు భారత్ గట్టి షాకిచ్చింది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ హింసకు పాల్పడుతున్న పాకిస్తాన్ కుట్రలను ఐక్యరాజ్యసమితిలో భారత్ ఎండగట్టింది. పాకిస్తాన్ ఇకపై ఏం చేసినా చూస్తూ ఊరుకునేది లేదని గట్టిగా హెచ్చరించింది. తాజాగా ఐక్యరాజ్యసమితిలో పహల్గాం ఉగ్రదాడి అంశాన్ని భారత్ లేవనెత్తింది. న్యూయార్క్‌లో 'ఉగ్రవాద అనుబంధ నెట్‌వర్క్ బాధితుల' కార్యక్రమంలో ఐరాసకు భారత డిప్యూటీ శాశ్వత ప్రతినిధిగా ఉన్న యోజన పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పటేల్ మాట్లాడుతూ.. 'పాకిస్తాన్ ప్రపంచ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నామని స్వయంగా పాక్ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ బయటపెట్టారు. ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్నట్లు ఏకంగా రక్షణ మంత్రి ఇటీవల అంగీకరించడాన్ని ప్రపంచం మొత్తం విన్నది. ఇలాంటి బహిరంగ వ్యాఖ్యలు చేసిన తర్వాత కూడా పాకిస్తాన్‌ను ఎందుకు క్షమించాలి. ప్రపంచం ఇకపై కళ్లు మూసుకొని చూస్తూ ఉండదు. భారత్‌పై నిరాధార ఆరోపణలు చేయడానికి ఈ అంతర్జాతీయ వేదికను పాక్ దుర్వినియోగం చేస్తోంది' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్, భారత్ మధ్య సంబంధాలు తెగిపోయి యుద్ధం మేఘాలు కమ్ముకుంటున్న క్రమంలో పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంతో, ఉగ్రవాద గ్రూపులకు నిధులు, మద్దతునివ్వడంతో పాకిస్తాన్ పాత్ర ఉందని అంగీకరించారు. సుమారు మూడు దశాబ్దాలుగా అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమ దేశాలకోసం ఈ నీచమైన పని చేశామంటూ వ్యాఖ్యలు చేశారు. అలాగే, సోవియట్ యూనియన్ యుద్ధం, భారత్‌లో జరిగిన 9/11 దాడుల్లో పాల్గొనకపోయి ఉంటే పాకిస్తాన్ ట్రాక్ రికార్డు మరోలా ఉండేది. భారత్ నుంచి దాడి జరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే మేము మా బలగాలను పటిష్టం చేశాం. ఈ పరిస్థితుల్లో కొన్ని వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది, ఆ నిర్ణయాలు తీసుకున్నాం అని చెప్పుకొచ్చారు.

# పనసపళ్ల చాటున..గంజాయి సప్లయ్!

హైదరాబాద్,ఎక్సైజ్ శాఖ తన పటిష్టమైన సమాచార వ్యవస్థతో మత్తు పదార్థాల అక్రమ రవాణా చేసే ముఠాలపై కన్నేసి ఎప్పటికప్పుడు వారిని పట్టుకుని కటకటాల పాలు చేస్తుంది. ఆ భయంతో మత్తు పదార్థాల అక్రమ రవాణా దారులు ఎక్సైజ్ శాఖ కళ్లుగప్పి, కొత్త ఎత్తుగడలతో తమ వ్యాపారం కొనసాగించే ప్రయత్నం చేసిన ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ వి బి కమలాసన్ రెడ్డి దిశా నిర్దేశంతో మత్తు పదార్థాల అక్రమ రవాణా చేసే స్మగ్లర్ల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగడుతూ అక్రమ వ్యాపారస్తుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు. ఇదే క్రమంలో సోమవారం ఒడిషా నుంచి ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా పలాస, విశాఖపట్నం విజయవాడ మీదుగా రాష్ట్రానికి కోటి రూపాయల విలువ చేసే గంజాయిని పెద్ద ఎత్తున రవాణా చేస్తున్నారనే సమాచారం అందగా, స్టేట్ టాస్క్ ఫోర్స్ అడిషనల్ ఎస్పీ భాస్కర్ కు ఆ సమాచారాన్ని తెలిపి, గంజాయి తరలిస్తున్న ముఠా కదలికలపై నిఘా వేసి వారిని పట్టుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలపై అడిషనల్ ఎస్పి భాస్కర్ స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం "సి" డి.ఎస్. పి. తులా శ్రీనివాసరావు, ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వర్లు సిబ్బందికి అప్రమత్తం చేయడం జరిగింది. అదేవిధంగా డీఎస్పీ తిరుపతి యాదవ్, ఇన్ స్పెక్టర్ నాగరాజులను కూడా సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి, గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకోమని ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలపై స్టేట్ టాస్క్ ఫోర్స్ టీం " సి " " డి " మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా, పటిష్టమైన ప్రణాళికతో, చక్కటి కార్యాచరణతో నిర్వహించిన తనిఖీలతో పెద్ద ఎత్తున గంజాయిని తరలిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి కోటి రూపాయల విలువ చేసే (410) కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నిందితుల నేపథ్యం..

మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గణేష్ రామస్వామి అనునతడు ఒక ప్రైవేటు డ్రైవర్ గా జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. కానీ అతనికి వచ్చే జీతం డబ్బులతో సంతృప్తి చెందక మరేదైనా అక్రమ మార్గంలో ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించాలని దురాశతో ఉండగా వారికి రత్నాభాయి అనే గంజాయి వ్యాపారం చేసే ఒక వ్యక్తి పరిచయం అయింది. గంజాయి వ్యాపారంలో డబ్బులు ఎక్కువ మొత్తంలో సంపాదించవచ్చని గణేష్ రామస్వామికి చెప్పగా గణేష్ లో అప్పటికే ఉన్న దురాశ మరింతగా పెరిగింది. అందుకుగాను, అతనితో పాటు డ్రైవింగ్ వృత్తిలో ఉన్న విజయ్ శంకర్ కులకర్ణి అనే వ్యక్తి సహకారం కోరాడు. అందుకు అతను కూడా తన సహకారం అందించుటకు అంగీకరించాడు. తర్వాత గణేష్ రామస్వామి తమ గంజాయి అక్రమ రవాణాకు సులువుగా ఉంటుందనే ఉద్దేశంతో ఒక మహీంద్రా మినీ వ్యాను కూడా కొనుగోలు చేశాడు. అప్పటికే గంజాయి అక్రమ వ్యాపారంలో ఆరితేరిన రత్నాబాయ్ సహకారంతో ఒడిశాలోని గంజాయి సరఫరాదారులతో పరిచయం చేసుకొని గంజాయి అక్రమ వ్యాపారానికి తెరలేపారు.

నిందితులు పట్టుబడిన తీరు..

ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ ఆదేశాలతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేట్ టాస్క్



ఫోర్స్ నిందితుల కదలికలపై 20రోజులుగా నిఘా పెట్టి వారి కదలికలను క్షుణ్ణంగా నిశితంగా గమనిస్తున్న క్రమంలో సోమవారం నిందితులు వ్యానులో గంజాయిని తరలిస్తున్నారని పకడ్బందీ సమాచారం రాగా ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో మాటు వేసిన ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్, మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు గంజాయి అక్రమ రవాణా చేసే ముఠా కోసం ఎదురుచూస్తున్న క్రమంలో ఔటర్ రింగ్ రోడ్డులో మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ కలిగిన మహేంద్ర మినీ వ్యాన్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారుల కంటపడింది. వెంటనే అట్టి వ్యాను ఆపి తనిఖీ చేయగా, పనస పళ్ల లోడుతో కనిపించింది. అందులో ఉన్న వ్యక్తులను విచారించగా, వారు తాము పళ్ల వ్యాపారం చేస్తామని, శ్రీకాకుళం జిల్లా పలాస నుండి పనస పళ్ళను మార్కెట్ కు తరలిస్తున్నామని చెప్పారు. అనుమానాస్పదంగా ఉన్న వారి హావభావాలను గమనిస్తూ వ్యానును క్షుణ్ణంగా తనిఖీ చేసిన టాస్క్ ఫోర్స్ అధికారులు ఆశ్చర్య పోయారు. రహదారిపై తనిఖీ అధికారుల కళ్లు గప్పడానికి నిందితులు పనస పళ్ల లోడ్ కింది భాగంలో గంజాయిని నింపి, అనుమానం రాకుండా ఆ గంజాయిపై పనస పళ్ళను పోసి తీసుకు వెళుతున్నట్టుగా గమనించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారు శ్రీకాకుళం జిల్లా పలాసకు చేరుకుని అక్కడికి సమీపంలో ఉన్న ఒడిశా నుంచి గంజాయి వ్యాపారం చేసే వారి వద్ద నుండి గంజాయిని కొనుగోలు చేసి, దారిలో అధికారుల తనిఖీలో పట్టు పడకుండా ఉండడానికి పలాసలో పనస పళ్ళను కొనుగోలు చేసి తమ వ్యానులో గంజాయిపైన పనస పళ్ళను నింపి తరలిస్తున్నామని తెలిపారు. వెంటనే ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్, మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు నిందితుల వద్ద నుండి కోటి రూపాయల విలువ చేసే 410కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగింది.

నిందితుల వివరాలు

మహారాష్ట్ర ఉస్మానాబాద్ కు చెందిన గణేష్ రామస్వామి, విజయ్ శంకర్ లు గంజాయిని కిలో చొప్పున విడదీసి చిన్న ప్యాకెట్ల లోనికి మార్చి బీదర్, తాండూర్, వికారాబాద్, హైదరాబాద్ లో మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు 410కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమంగా రవాణా చేయటానికి ఉపయోగించిన మహీంద్రా మినీ వ్యాను, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# తీర్పులు అనుకూలంగా లేకపోతే సుప్రీంనే బెదిరిస్తారా?

న్యూఢిల్లీ,ఇటీవల వక్ఫ్ సవరణ చట్టం 2025 విచారణ సందర్భంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యల పట్ల కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సుప్రీం ధర్మాసనం వక్ఫ్ భూముల విషయంలో ఎవరి తరపున నిలుస్తోంది అన్న సందేహాన్ని బలంగా ప్రచారంలో పెడుతున్నారు. అయితే, ఈ వ్యాఖ్యలపై స్పందించే ముందు, న్యాయ వ్యవస్థ పాత్రను సరైన దృక్పథంతో విశ్లేషించడం అవసరం. వక్ఫ్ చట్టంపై కోర్టు చేసిన వ్యాఖ్యలు విచారణలో భాగంగా వచ్చిన ప్రశ్నలే కానీ, మత పక్షానికో, రాజకీయ పక్షానికో అనుకూలంగా ప్రతికూలంగా చేయబడినవి కావు. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగం. తుది తీర్పు ఇంకా రావలసి ఉంది.

ఘటన స్థాయిని బట్టే స్పందన..

ఇటీవలే తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆక్షేపణలు ఇదే విషయాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులపై గవర్నర్ ఆలస్యంగా స్పందించడాన్ని కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఇది సూత్రాలకు కట్టుబడి న్యాయం చెప్పే కోర్టు ధోరణికి ఉదాహరణ. ఇక 'మణిపూర్ విషయంలో కోర్టు తీవ్రంగా స్పందించింది, కానీ పశ్చిమ బెంగాల్‌లో అటువంటి స్పందన ఎందుకు లేదు' అనే విమర్శలు చేస్తున్నారు. ఇక ఆయా రాష్ట్రాల్లో జరిగిన సంఘటనలకు పరస్పరం పోలికే లేదు. మణిపూర్లో జరిగిన ఘోరం, మహిళలపై సామూహిక లైంగికదాడి, నగ్నంగా నడిరోడ్డుపై వదిలేయడం, సామాజిక అస్థిరత మధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగిన అశాంతి ఇవన్నీ మానవ హక్కుల ఉల్లంఘనకు అత్యంత దారుణ ఉదాహరణలు.. సుప్రీంకోర్టు స్పందన కూడా ఆ ఘాతుక స్థాయికి తగినట్టుగానే తీవ్రంగా వ్యక్తమైంది.

విశ్లేషణ అవసరం!

పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకున్న ఎన్నికల హింస, పోలీసు వ్యవస్థ వైఫల్యం



వంటి అంశాలు కోర్టు విచారిస్తోంది. కానీ రెండింటికీ ఒకే స్థాయిలో, ఒకే తీరు స్పందించాలన్న తర్కం అర్థరహితం. న్యాయవ్యవస్థ ప్రతి అంశాన్ని దాని దృఢత, స్థితిగతుల మేరకే పరిశీలిస్తుంది. ఎప్పుడూ ఒకే తీరుగా, ఒకే స్థాయిలో స్పందించదు. మణిపూర్ విషయంలో సుప్రీంకోర్టు స్పందించకపోతే, బాధిత మహిళలకు న్యాయం ఎక్కడి నుంచి లభిస్తుంది ఇది ఆలోచించాల్సిన విషయం కాదా! వక్ఫ్ సవరణ చట్టం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చేసి వ్యాఖ్యలను మతపరమైన కోణంలో చూస్తున్నారు. కానీ, అది భూయాజమాన్యం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ బాధ్యత వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలకు సంబంధించిన చర్చ. ఈ నేపథ్యంలో కోర్టు ప్రశ్నలు చాలా సహజమైనవి. అవి మత వ్యతిరేకమైనవి కాదు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంలో సమీక్షకు తావిస్తే తప్పు కాదు. కోర్టు తీర్పులను, వ్యాఖ్యలను నిందించే ముందు, వాటిలోని గంభీరతను, అవసరాన్ని గుర్తించాలి. విమర్శలకంటే విశ్లేషణ అవసరం అదే ప్రజాస్వామ్యాన్ని బలపరిచే మార్గం. న్యాయవ్యవస్థ ప్రశ్నకు అతీతం ఏంకాదు. విమర్శ ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అవసరమే! అయితే అది వివేచనతో, విజ్ఞతతో ఉండాలి. లేకపోతే న్యాయం అన్న భావనే అపహాస్యం పాలయ్యే ప్రమాదం ఉంది.

# పెట్రోల్‌పై ఎక్సైజ్, వ్యాట్ ధరలు ..వాటిని తగ్గిస్తే కొంతమేరకుమేలు




న్యూఢిల్లీ,దేశంలో పెరుగుతున్న ధరల కారణంగా పెట్రో ధరలను కంట్రోల్ చేస్తే..ఇతరత్రా రవణా ఛార్జీలు తగ్గుతాయి. ఆ మేరకు సరుకులపైనా ధరలు తగ్గుతాయి. ఈ తరహా ఆలోచన చేయడం లేదు. గత ఐదారేళ్లుగా పెట్రో ధరలపై ప్రధాని అవాస్తవాలు చెబుతున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. నిజానికి చమురు కంపెనీలు గనుక ఈ విధంగా ధరలను పెంచిన్నట్లైతే, అది అక్కడితో ఆగిపోదు. మొత్తం ఆర్థిక వ్యవస్థలో అనేక వస్తువుల ధరలు దాని ఫలితంగా పెరుగుతాయి. కాంగ్రెస్ హయాంలో పెట్రో ధరలపై విరుచుకు పడ్డ మోడీ ఇప్పుడా విషయం మరచిపోయినట్లు ఉన్నారు. ధరల పెరుగుదాల, జీఎస్టీపైనా గుజరాత్ సిఎంగా విమర్శలు గుప్పించిన విషయం ప్రజలు ఇంకా మరచి పోలేదు. నిజానికి కేంద్రంపెట్రోల్‌పై ముందుగా ఎక్సైజ్ డ్యూటీ తగ్గించివుంటే బాగుండేది. ఆ తర్వాత వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలకు చెప్పివుంటే మోడీ నిజాయితీగా ఉన్నాడని అనుకునే వారం. మోడీ అధికారంలోకి వచ్చాక లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.18 కిపైగా పెంచారని కాంగ్రెస్ నేతలు పదేపదే చెబుతూనే వచ్చారు. యూపీఏ హయాంలో లీటర్ పెట్రోల్‌పై రూ.9.84 ఎక్సైజ్ డ్యూటీ ఉండగా.. మోడీ దాన్ని రూ.27.90కు, లీటర్ డీజిల్‌పై రూ.3.56గా ఉన్న సుంకాన్ని రూ.21.80కు పెంచారు. వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలను కోరే ముందు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి చిత్తశుద్ధి చాటుకుంటే బాగుండేది. ఇదిలా ఉంటే సెంట్రల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో లక్షల కోట్లు ఆదాయం వస్తున్న విషయాన్ని ప్రధాని ప్రజలకు చెప్పడం లేదు. ఎక్సైజ్ సుంకం ద్వారా కేంద్రానికి రూ.26 లక్షల కోట్ల ఆదాయం వచ్చిన విషయాన్ని ప్రధాని ఎక్కడా ప్రస్తావించడంలేదు. జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రాల వాటాను సకాలంలో చెల్లించడం లేదు. కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని..ఆ తర్వాత రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలి. అప్పుడే పెట్రో ధరలు తగ్గి రవాణా ఛార్జీలు తగ్గుతాయి. దీంతో సరకు రావాణా భారం కూడా తగ్గుతుంది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని, అక్కడి ప్రభుత్వాలు విలువ ఆధారిత పన్ను వ్యాట్ తగ్గించకపోవడమే ఇందుకు కారణమని బిజెపి నేతలు నీతులు వల్లిస్తున్నారు. ఓ రకంగా పెట్రో ధరలపై రాష్ట్రాలను అప్రతిష్టపాలు చేయాలన్న ఆలోచన తప్ప నిర్మాణాత్మక ఆలోచన మాత్రం చేయడం లేదు. సామాన్య ప్రజలకు ఊరట కలిగించడానికి, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ,వ్యాట్ తగ్గించాల్సిందే. అప్పుడు ప్రభుత్వం కూడా తన వ్యయాన్ని ఆ మేరకు పెంచవలసి వుంటుంది. ఆ విధంగా అదనపు వ్యయం చేయాలంటే అందుకోసం ప్రభుత్వం తన ఆదాయాన్నీ పెంచుకోవాలి, అందుకు ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల మీద తనకు వచ్చే పన్ను ఆదాయాన్ని పెంచుకోవాలి. ప్రభుత్వం మాదిరిగానే పెట్రో ఉత్పత్తులను వినియోగించే ప్రతీ సంస్థ ఆర్‌టిసి, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలువంటివి కూడా తమ సేవల రేట్లు పెంచవలసి వుంటుంది. ఇదంతా కలిసి ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయి. ఇంతటితోనే ఇది ఆగదని, రాబోయే రోజుల్లో ఇదే విధమైన వడ్డింపులు మరిన్ని రానున్నా యని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అటు కంపెనీలూ చమురు పెరుగుదల భారాన్ని భరించడానికి సిద్ధంగా లేవు. ఇటు ప్రభుత్వమూ పెరిగే ధరల ద్వారా తనకు లభించే అదనపు ఆదాయాన్ని వదులు కోడానికి సిద్ధంగా లేదు. భారమంతా వినియోగదారులపైనే పడేయడం ద్వారాచేతులు దులుపుకోవాలన్న ధోరణిలో పాలకులు ఉన్నారు.

# కర్రెగుట్టలో కొనసాగుతున్నకూంబింగ్...



హైదరాబాద్,ఆపరేషన్ కగార్ లో భాగంగా కీలకమైన కర్రెగుట్ట ను స్వాధీనం చేసుకునేందుకు భద్రతా దళాలు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ఏడు రోజులుగా కూంబింగ్ జరుగుతోంది. ఈ గుట్టల్లో సుమారు 1000మంది మావోయిస్టులు ఉన్నట్లు బలగాలకు సమాచారం ఉండడంతో గాలింపు ముమ్మరం చేశాయి. ఆపరేషన్ కగార్ లో భాగంగా కీలకమైన కర్రెగుట్ట ను స్వాధీనం చేసుకునేందుకు భద్రతా దళాలు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ఏడు రోజులుగా కూంబింగ్ జరుగుతోంది. ఈ గుట్టల్లో సుమారు 1000మంది మావోయిస్టులు ఉన్నట్లు బలగాలకు సమాచారం ఉండడంతో గాలింపు ముమ్మరం చేశారు. పదివేల మందితో కూడిన భద్రతా దళాలు ఈ కూంబింగ్‌లో పాల్గొంటున్నాయి. కర్రెగుట్టలో 100 కు పైగా సొరంగాలు, గుహలు ఉన్నట్లు భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ గుహలు బలగాలకు సవాల్‌గా మారాయి. గుట్ట చుట్టూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను నిర్వీర్యం చేసుకుంటూ బలగాలు ముందుకు సాగుతున్నాయి. ఇప్పటివరకు 112 ఎల్ఈడీ బాంబులను బలగాలు నిర్వీర్యం చేశాయి. మావోలు ప్రెషర్ కుక్కర్ బాంబులతో బలగాలకు సవాల్ విసురుతున్నారు. మరోవైపు విపరీతమైన ఎండలు దళాలకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. ు 3 బేస్ క్యాంపులతో భద్రతా దళాలు జల్లెడ పడుతున్నాయి. మరోవైపు ు డ్రోన్లు, హెలికాప్టర్లతో సెర్చింగ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా ఆపరేషన్ కగార్ నిలిపివేయాలంటూ మావోలు కోరుతున్నారు. శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి మరోసారి లేఖ విడుదల చేశారు. ఛత్తీస్‌గఢ్ -తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టల్లో భద్రతా దళాల కూంబింగ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న కర్రెగుట్టల్లో వారి రహస్య స్థావరాల్లోకి భద్రతా బలగాలు చొచ్చుకెళ్లాయి. గుట్టలో శనివారం భారీ సొరంగాన్ని గుర్తించిన విషయం తెలిసిందే. ఒక్కొక్కరే వెళ్లగలిగేలా ఉన్న ఈ రాతి సొరంగం మార్గంలో దాదాపు 80 అడుగులు లోపలికి వెళ్లిన కోబ్రా, సీఆర్పీఎఫ్ బలగాలు విశాలంగా ఉన్న ప్రాంతాన్ని గుర్తించాయి. లోపల అనుబంధంగా మరో నాలుగు గుహలు ఉన్నట్లు నిర్ధారించాయి. ఇక్కడ దాదాపు వెయ్యి మంది ఆశ్రయం పొందవచ్చని ఆనవాళ్ల బట్టి అంచనా వేశారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆయా ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ఆపరేషన్‌కు కొంత ఆటంకం ఎదురైంది. తరువాత వెంకటాపురం మండలంలోని తాపాల నిచ్చెన మీదుగా కర్రెగుట్టల్లోకి బలగాలు చొచ్చుకెళ్లాయి. చెలిమల, ముకునూరు అరణ్యంలో కూంబింగ్‌ను నిర్వహిస్తూ ముందుకు సాగాయి.

# రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఊరట..

వెలగపూడి : రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. ఏబీవీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో భద్రతా పరికరాల కొనుగోలు టెండర్లలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరుతూ ఏబీ వెంకటేశ్వరరావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. అంతేకాకుండా, హైకోర్టు తీర్పు వెల్లడించే వరకు విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణపై స్టే విధించింది. భద్రతా పరికరాల కొనుగోలు టెండర్ వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో ఏబీ వెంకటేశ్వరరావుపై 2021 మార్చిలో కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఏబీ వెంకటేశ్వరరావు 2022లో హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున బి. ఆదినారాయణరావు వాదనలు వినిపించారు. కాగా, ఈ కేసులోనే ఏబీ వెంకటేశ్వరరావును గత వైసీపీ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. నాటి ప్రభుత్వ ఉత్తర్వులపై హైకోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకూ ఏబీవీ న్యాయపోరాటం చేశారు. సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులతో ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్ ఎత్తివేసిన నాటి ప్రభుత్వం, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ అడిషనల్ డీజీగా బాధ్యతలు



అప్పగించింది. అయితే బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే మరలా సస్పెండ్ చేయడంతో ఏబీవీ క్యాట్‌ను ఆశ్రయించారు. సస్పెన్షన్ ఉత్తర్వులను క్యాట్ రద్దు చేయడంతో నాటి ప్రభుత్వం ఆయన పదవీ విరమణకు ఒక్క రోజు ముందు పోస్టింగ్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. దాంతో ఆయన మరలా ప్రింటింగ్ అండ్ స్టేషనరీ విభాగం అడిషనల్ డీజీగా బాధ్యతలు చేపట్టి అదే రోజు పదవీ విరమణ చేశారు.

# కెనడాలో ఆప్ నేత కుమార్తె అనుమానాస్పద మృతి

న్యూఢిల్లీ,భారతీయ విద్యార్థి కెనడా (కెనడా)లో భారత్‌కు చెందిన విద్యార్థుల (భారతీయ విద్యార్థులు) వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పది రోజుల క్రితం కెనడాలో జరిగిన కాల్పుల్లో ఒంటారియోలోని హామిల్టన్‌లోని మోహాక్ కళాశాలలో చదువుతున్న హర్‌సిమ్రత్ రంధావా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా మరో భారతీయ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోయారు. హర్యాణా రాష్ట్రానికి చెందిన వన్షిక.. పైచదువుల కోసం రెండేళ్ల కిందట కెనడాకు వెళ్లింది. అక్కడ స్థానికంగా ఉన్న కళాశాలలో చదువుకుంటోంది. ఈ అంచనా ఏప్రిల్ 18న ఎగ్జామ్స్ ఫైనల్ పూర్తవడంతో ఒట్టావా (ఒట్టావా)లోనే ఓ పార్ట్‌టైమ్ జాబ్‌లో చేరింది. ఈ మొత్తం 25న డ్యూటీ కోసం వెళ్లిన వంశిక తిరిగి రాలేదు. రోజూ కుటుంబ సభ్యులు ఆమెతో ఫోన్‌లో మాట్లాడేవారు. అయితే, 25వ తేదీ నుంచి ఆమె ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ అని వస్తోంది. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు మూడు రోజులుగా వన్షిక



కోసం తీవ్రంగా గాలించారు. ఈ రోజు బీచ్‌లో శవమై కనిపించింది. ఈ తనిఖీ ఒట్టావాలోని భారత రాయబార కార్యాలయం ఎక్స్‌ద్వారా ప్రదర్శన. వన్షిక.. పంజాబ్‌లోని ఆప్ నేత దేవిందర్ సింగ్ కుమార్తెగా అధికారులు పేర్కొన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com